
ఈనాడు
అమరావతి
కృష్ణా
బుధవారం అక్టోబరు 23, 2024



అన్నుల మిన్నుల.. అదిరే కన్నుల..



మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో జ్యోతి వెలిగించి డ్రోన్ సమ్మిట్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. పక్కనే కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరులు

డ్రోన్ పనితీరు గురించి తెలుసుకుంటున్న సీఎం

మంగళగిరికి తరలివచ్చిన యువతీ యువకులు

కృష్ణా తీరంలో డ్రోన్ల విహంగ విహారంతో.. అద్భుతాలు ఆవిష్కృతమయ్యాయి. ఆకాశంలో అపురూప దృశ్యాలు కనువిందు చేశాయి. గతంలో ఎన్నడూ చూడని అద్భుతమైన డ్రోన్ల ప్రదర్శనను చూసి.. వేల మంది ఆహూతులు కేరింతలు కొట్టారు. కృష్ణా నదీ తీరంలో పున్నమిఘాట్‌లో.. దేశంలోనే ఎన్నడూ లేనన్ని రికార్డుల మోత మోగింది. దేశంలోనే అతిపెద్ద డ్రోన్ల ప్రదర్శనకు వేదికగా నిలిచి.. ఏకంగా ఐదు గిన్నిస్ రికార్డులను నెలకొల్పింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి వేల మంది అతిథులు తరలివచ్చి ఈ డ్రోన్ల ప్రదర్శనను తిలకించారు. విజయవాడ, మంగళగిరి కేంద్రాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమరావతి డ్రోన్ సమ్మిట్‌లో తొలిరోజు.. ఊహకే అందని అద్భుతాలు ఆకాశంలో ఆవిష్కృతమయ్యాయి. మంగళవారం ఉదయం మంగళగిరి వేదికగా సమ్మిట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టగా.. కేంద్ర మంత్రి రామ్మోహన్, మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, సంధ్యారాణి, సవిత తదితర ప్రజాప్రతినిధులు, సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ హాజరయ్యారు.



యాలీ డ్రోన్

మనుషులు చేరుకోలేని ప్రాంతాలకు దీని ద్వారా వైద్య సామగ్రిని ఇట్టే పంపవచ్చు.

రెడ్ వింగ్

గమ్యం చేరలేని గ్రామీణ ప్రాంతాలకు మందులను చేరవేసే డ్రోన్ పనితీరు తెలుసుకుంటున్న యువత

భద్రతకు భరోసా

రక్షణకు దోహదం చేసే డ్రోన్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

అన్నదాతకు అండగా..

పంటలకు పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్‌ను పరిశీలిస్తున్న సందర్శకులు

సర్వేలెన్స్ డ్రోన్

భూ కొలతలు, సర్వేను పారదర్శకంగా చేపట్టే అధునాతన పరికరం

ఈనాడు, డిజిటల్ – అమరావతి, న్యూస్‌టుడే– భవానీపురం, విద్యాధరపురం




చంద్రహాసం...

ఆకాశంలో 5,500 డ్రోన్లు కలిసి చేసిన విన్యాసాలను చూస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆనందం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు బి.సి.జనార్దన్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి డ్రోన్ల ప్రదర్శనను ముఖ్యమంత్రి తిలకించారు. ముంబయికి చెందిన వికాస్ అన్‌బీటబుల్ డ్రీమ్ టీం చేసిన నృత్య ప్రదర్శనను సైతం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా సైకిల్‌తో ఈ బృందం చేసిన విన్యాసాలు చూసి.. ముఖ్యమంత్రి నవ్వులు కురిపించారు. డ్రోన్ల ప్రదర్శన, లేజర్‌షో, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య, సంగీత ప్రదర్శనలు అలరించాయి.

అభినవ డ్రోనాచార్య!

- అన్ని రంగాలనూ నడిపించేది.. డ్రోన్లే
- సాంకేతికతకు.. అభివృద్ధికి బాసట
- నూతన ఆవిష్కరణలపై నయా ఆసక్తి
- అమరావతి డ్రోన్ సమ్మిట్‌కు తరలివచ్చిన యువత

యువ



డ్రోన్ల విశిష్టతను వివరిస్తూ..



డ్రోన్ షోలో యువత సందడి..

ఈనాడు, ఈనాడు డిజిటల్ - అమరావతి

ఒక వినూత్న ఆలోచన.. సమాజం పురోభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు దోహదపడుతోంది. నిత్య జీవితంలో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిస్తోంది. కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానం మానవాళికి ఎంతో ఉపయోగపడుతోంది. భవిష్యత్తులో పలు రంగాల్లో డ్రోన్ టెక్నాలజీ కీలక మార్పులు తీసుకురానుంది. ఇప్పుడిప్పుడే అనేక అవసరాలకు డ్రోన్లు అక్కరకొస్తున్నాయి. తప్పిపోయిన వ్యక్తులను కనిపెట్టడం.. ప్రకృతి వైపరీత్యాల వేళ బాధితులకు ఆహారం, మందులు అందించడం.. నష్టాలను అంచనా వేయడం.. జన సమూహాలపై నిఘా.. వ్యవసాయంలో సస్యరక్షణ.. వంటి విభాగాల్లో ఎంతో ఉపకరిస్తున్నాయి. ఈ రంగంలో కొత్త ఆవిష్కరణలు, విభిన్న అవసరాలకు ఉపయోగపడే డ్రోన్లు, వాటిల్లో నూతన సాంకేతికత, అభివృద్ధిలో డ్రోన్ల పాత్ర, తదితర అంశాలతోపాటు భవిష్యత్తు మార్గసూచీపై గుంటూరు జిల్లా మంగళగిరిలో 'అమరావతి డ్రోన్ సమ్మిట్' ప్రారంభమైంది. దీనికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు, సందర్శకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సదస్సుకు వచ్చిన పలువురు ఇది తమకు ఎంతో ఉపయోగపడిందనీ, భవిష్యత్తులో తమ ప్రాజెక్టుల రూపకల్పనకు అక్కరకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అవయవాలను తరలించే డ్రోన్ల తయారీపై దృష్టి

మేము మెకానికల్ ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నాం. మా కళాశాలలో ఇదివరకే పంటలపై పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్, తప్పిపోయిన వారిని అన్వేషించేందుకు ఉపయోగపడే వాటిని రూపొందించాం. వివిధ అవసరాలకు పనికొచ్చేలా డ్రోన్ల అభివృద్ధికి ఉపకరిస్తుందని ఈ సదస్సుకు వచ్చాం. అవయవ దానం తర్వాత వాటిని తరలించేందుకు ఇప్పుడు అంబులెన్సులకు గ్రీన్ ఛానల్ ఇస్తే కానీ సకాలంలో తీసుకెళ్లలేని పరిస్థితి. కాలహరణాన్ని అధిగమించేందుకు డ్రోన్ల ద్వారా అవయవాలను రవాణా చేసే అంశంపై దృష్టి సారించాం. గత ఏడాది ఐఐటీ మద్రాస్‌లో జరిగిన వర్క్‌షాప్‌లో మేం తయారు చేసిన పలు డ్రోన్లను ప్రదర్శించి, వాటి గురించి వివరించాం. మా ఆవిష్కరణలకు బహుమతులు వరించాయి.

- పి.శశిధర్, పి.తిరుమలేష్, కె.వి.సాయితేజ, డి.ధీరజ్, ఎస్.డి. నవాజ్.. నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరు



సొంతంగా ఎదగాలనే స్టార్టప్ ఏర్పాటు



నాకు విదేశీ వస్తువులంటే పెద్దగా ఇష్టం ఉండదు. దేశీయంగా తయారు చేయాలనే పట్టుదలతోనే స్టార్టప్ ఏర్పాటు చేశాను. నేను అనంతపురం జేఎన్‌టీయూలో బీటెక్ చదివిన తర్వాత హైదరాబాద్ ఐఐటీలో ఐటీలో ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశాను. ఐఐటీ ప్రాంగణంలోని ఇన్ టింకర్స్ ల్యాబ్‌లో నేను ఎక్కువ సమయం గడిపా. అక్కడ సొంతంగా రోబోటిక్ చెయ్యిని తయారు చేసేందుకు చాలా కష్టపడ్డా. ఆ ప్రయోగం విఫలమైంది. ఇది నాలో పట్టుదల పెంచింది. డ్రోన్ ప్రాజెక్టుల 'అమని ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు కోసం 'ఎక్స్ న్యూరోపిల్' అనే స్టార్టప్ ఏర్పాటు చేశాను. డ్రోన్ వేగాన్ని నియంత్రించేందుకు ఎలక్ట్రానిక్ స్పీడ్ కంట్రోలర్ (ఈఎస్‌సీ) పరికరాలను సొంతంగా తయారు చేసి ఆర్డర్లపై సరఫరా చేస్తున్నా. నా వద్ద ఉన్న నిపుణుల బృందం తోడ్పాటుతో.. వచ్చే ఆర్డర్లను తీసుకుని తయారు చేయించి ఇస్తున్నా. వర్సిటీ లాభంలో వారికి వాటా ఇస్తున్నా. భవిష్యత్తులో రోబోటిక్స్‌లో పరిశోధనలపైనా దృష్టి సారిస్తా. సాంకేతిక పరిజ్ఞానంతో బయోడీజిల్ తయారీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా.

- ఎ.పురందర్, ఎం.టెక్, ఐఐటీ హైదరాబాద్

నిఘా మరింత మెరుగుపరిచేలా..



మేం ఇంజినీరింగ్‌లో రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ విభాగాన్ని ఎంచుకున్నాం. వివిధ వస్తువులను సరఫరా చేసే డ్రోన్లను తయారు చేస్తున్నాం. భవిష్యత్తులో రాత్రి సమయాల్లో పోలీసులకు ఉపయోగపడేలా గస్తీకి ఉపయోగపడేలా తయారు చేయాలని భావిస్తున్నాం. అసాంఘిక శక్తుల జాడ పసిగట్టగానే అలారం మోగేలా తయారు చేస్తాం. దీనిని వీలైనంత త్వరగా రూపొందించి వినియోగంలోకి తీసుకురావాలన్న పట్టుదలతో ఉన్నాం. పరిశ్రమల్లో డ్రోన్ తయారీలో విభాగంలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు తెలుసుకునేందుకు సదస్సుకు వచ్చాం. డ్రోన్లు మరింత అభివృద్ధి చేసేలా సమ్మిట్‌కు వచ్చిన వారితో చర్చించి సూచనలు, సలహాలు తీసుకున్నాం.

- సీహెచ్.జ్యోతిక, ఎస్.భార్గవి, ఎం.ప్రత్యూష, విజ్ఞాన్ యూనివర్సిటీ, వడ్లమూడి

మార్గం నిర్దేశిస్తే.. గమ్యస్థానం చేరేలా..



మేం ఈసీఈ రెండో ఏడాది చదువుతున్నాం. విమానయాన రంగమంటే చాలా ఇష్టం. ఆ ఆసక్తితో డ్రోన్లపై పరిశోధనలను ప్రారంభించాం. కనీస సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో వీటిని విరివిగా వినియోగిస్తేనే పరిశోధనల ఫలాలు మారుమూల ప్రాంతాలకూ చేరతాయి. డ్రోన్ల జీపీఎస్ పరికరాన్ని అమర్చి, మార్గాన్ని నిర్దేశించి గమ్యస్థానం చేరేలా తయారు చేశాం. తప్పిపోయిన వ్యక్తిని ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా గుర్తించే సాంకేతికతను జోడించాం. గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వస్తువులను సరఫరా చేసే మరో రెండు డ్రోన్లను కూడా రూపొందించాం. మరింత సామర్థ్యం గల డ్రోన్ల తయారీకి నలుగురం కలిసి బృందంగా ఏర్పడి ప్రయోగం చేస్తున్నాం. ఈ సమ్మిట్ ద్వారా కొత్త అవకాశాలు తెలుసుకున్నాం.

- పుష్పక్, ఆశిష్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, అమరావతి



ప్రజలతో కరచాలనం చేస్తూ..



డ్రోన్ల తళుకులు



ఆకట్టుకున్న కళాకారిణుల నృత్య ప్రదర్శన



వీఐపీ గ్యాలరీలో ప్రముఖులు



ఆలపిస్తున్న గాయకులు

సకళాభివందనం!

భవానీపురం, విద్యాధరపురం: కృష్ణా తీరాన ఆహ్లాద వాతావరణంలో పున్నమి, భవానీ ఘాట్‌ల వేదికగా నిర్వహించిన డ్రోన్ షో ఆద్యంతం అలరించింది. సభా వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాట్యకళాకారుడు అజయ్‌కుమార్ బృందం చేసిన కూచిపూడి, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. శంభో... శివ శంభో, ఘల్లు.. ..ఘల్లు... జోడెడ్ల బండ్లు అంటూ సాగిన నృత్యాలు అలరించాయి. గణపతి బప్పా మోరియా, నాటు...నాటు, నాకముక... నాకముక నృత్యాలు ఆహుతులను రంజింపజేశాయి. వికాస్ డ్రీమ్ టీమ్ విన్యాసాలతో కూడిన నృత్యం ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు చప్పట్లతో అభినందనలు తెలియజేశారు. మ్యూజిక్ బ్యాండ్ అలరించింది. వందేమాతరం..., కుర్రాళ్లోయ్.. కుర్రాళ్లు, కరిగిపోయాను...కర్పూర వీణలా అని సాగిన గీతాలు రంజింపజేశాయి. లేజర్ షో ఆద్యంతం ఆకట్టుకుంది. వీవీఐపీలకు రాత్రి భోజనం ఏర్పాటు చేయగా ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు డిన్నర్ చేసి వెళ్లారు.

బ్యాంకులో దస్తావేజులు మాయం

★ 6 నెలలుగా రైతు ప్రదక్షిణలు
★ పట్టించుకోని బ్యాంకు అధికారులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కానుమోలు సిండికేట్ బ్యాంకు (ప్రస్తుతం కెనరా బ్యాంకు)లో ఓ రైతు తీసుకున్న రుణాన్ని సకాలంలో పూర్తి వడ్డీతో సహా చెల్లించినా దస్తావేజులు ఇవ్వకుండా నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన రెడ్డి భాస్కర లక్ష్మణరావుకు స్థానికంగా ఆర్ఎస్ నంబర్లు 228, 296ల్లో 4.44 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 2011లో దీనిపై రూ.3 లక్షల పంట రుణం తీసుకున్నారు. ఇలా ఏటా రుణం తీసుకుంటూ, తిరిగి చెల్లించేస్తున్నారు. 2019లో పూర్తిగా పంట రుణం చెల్లించేసి, అవే పత్రాలతో రూ.4 లక్షల ట్రాక్టరు కొనుగోలు చేసేందుకు రుణం తీసుకున్నారు. ఈ ఏడాది మే31 నాటికి ఈ రుణాన్ని పూర్తిగా చెల్లించేసిన లక్ష్మణరావు, తన దస్తావేజులు, పట్టాదారు పాసు పుస్తకాలు తిరిగి ఇవ్వాల్సిందిగా బ్యాంకు అధికార్లను కోరారు. తొలుత 3 రోజుల్లో ఇస్తామని, ఆ తర్వాత ఆడిట్ జరుగుతుంది 2 వారాల్లో ఇస్తామంటూ అధికార్లు బదులిచ్చారు. ఆ తర్వాత బ్యాంకుకు వెళితే అప్పట్లో ఉన్న మేనేజరు సహా కొందరు అధికార్లు బదిలీపై వెళ్లిపోవడంతో సహాయ మేనేజర్‌ను ఆశ్రయించారు. ఎన్నిసార్లు తిరిగినా తన దస్తావేజులు తిరిగి ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన లక్ష్మణరావు ఇటీవల అధికారులను గట్టిగా నిలదీశారు. దీంతో దస్తావేజులు కన్పించడం లేదంటూ అసలు విషయం బయటపెట్టారు. పైగా ఇది తమ తప్పేమీ కాదన్నట్లుగా వ్యవహరిస్తూ దస్తావేజు నకళ్ల కోసం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవాలని, అవసరమైతే బ్యాంకు తరపున ఒక లేఖ ఇస్తామంటూ చెప్పే ప్రయత్నం చేశారు. దీనికి ఆగ్రహించిన రైతు తన దస్తావేజులు తనకు తిరిగి అప్పగించే బాధ్యత తీసుకోవాలని, లేకుంటే నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానంటూ మంగళవారం హెచ్చరించారు. ఈ వ్యవహారంపై ప్రస్తుత బ్యాంకు మేనేజర్ కె.వాసుని వివరణ కోరేందుకు 'న్యూస్‌టుడే' ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

బంగారం వ్యాపారిని దోచిన నిందితుల అరెస్టు

రూ.39 లక్షల నగదు స్వాధీనం

బాపట్ల, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై మేదరమెట్ల వద్ద బంగారం వ్యాపారి స్వరూప్‌కుమార్ నుంచి నగదు దోచిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.39 లక్షల నగదు, కారు, టార్చిలైట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం విలేకరులకు నిందితుల వివరాలు వెల్లడించారు. ఉయ్యూరు మండలం కాటూరుకు చెందిన ధనికొండ వెంకన్న స్వామి గతంలో లారీ డ్రైవర్‌గా పని చేశాడు. అదే గ్రామానికి చెందిన అతని స్నేహితులు పగడాల మహేష్ కార్పెంటర్‌గా, టెంటు కార్తీక్, పూరేటి శివ శ్రీనివాసరావు వెల్డింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నారు. వెంకన్న స్వామి తల్లి మూత్రపిండాలు పాడై మంచానపడ్డారు. ఆమెకు చికిత్స నిమిత్తం త్వరగా నగదు సంపాదించాలని భావించి స్నేహితులతో కలిసి చోరీ చేయాలని నిర్ణయించాడు. వెంకన్నస్వామి గతంలో ఓ ప్రైవేటు ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పని చేస్తూ విజయవాడ నుంచి చెన్నై వరకు లారీ నడిపాడు. ఆ సమయంలో గుంటూరు, చిలకలూరిపేట, వలపర్ల ప్రాంతానికి చెందిన బంగారు వ్యాపారులు చెన్నైలో బంగారం కొనుగోలుకు భారీ మొత్తం నగదుతో వెళ్లేవారు. అలా ఏదైనా లారీని ఆపి వ్యాపారులను బెదిరించి రూ.లక్షలల్లో చోరీకి ప్రణాళిక రూపొందించారు. ఈ నెల 18న రాత్రి విజయవాడలో ప్రైవేటు ట్రావెల్స్‌లో కారు అద్దెకు తీసుకుని నంబరు ప్లేటు తీసేసి విజయవాడ నుంచి ఓ లారీని అనుసరించారు. గుంటూరు సమీపంలో వ్యాపారి స్వరూప్ కుమార్ నోట్ల కట్టల సంచితో లారీ ఎక్కడం గమనించారు. ప్రణాళిక ప్రకారం మేదరమెట్ల వద్ద ఎన్‌హెచ్ 16లో కొరిశపాడు పైవంతెన వద్ద లారీకి కారు అడ్డు పెట్టి ఐటీ అధికారులమని చెప్పి లారీ డ్రైవర్, వ్యాపారిని బెదిరించారు. వ్యాపారిని కొట్టి కారులో ఎక్కించుకుని కొంత దూరం తీసుకెళ్లి అతని సంచిలో ఉన్న రూ.39.50 లక్షల నగదును తీసుకున్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి కారులో పరారయ్యారు. బాధితుడు మరుసటి రోజు మేదరమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ వెంటనే స్పందించి చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్ నేతృత్వంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఎన్‌హెచ్-16 టోల్‌ప్లాజా వద్ద సీసీ కెమెరాలు పరిశీలించి నలుగురు నిందితులను అరెస్టు చేశాయి.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 138, 147, 158 చికెన్ విత్ స్కిన్ - 266 చికెన్ స్కిన్‌లెస్ - 276.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన




బహుమతులు పొందినవారితో ప్రిన్సిపల్ తదితరులు, పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పోటీ పరీక్షలు.. ప్రతిభకు సోపానాలు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: పోటీ పరీక్షలు ప్రతిభకు సోపానాలు అని నగరంలోని జవహర్ ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్ వీర్నాల వెంకట శివప్రసాద్ అన్నారు. పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు..విద్యార్థులపై సోషల్‌మీడియా ప్రభావం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చాటుకున్నారు. ఈ పోటీల్లో ఎం.జయశ్రీ(9వతరగతి), టి.శోభిత(8వతరగతి), బి.సాయిప్రశాంత్(9వతరగతి)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయులు ఇ.రమాదేవి, పి.కొండలరావు, శివపార్వతి తదితరులు కలిసి బహుమతులు అందజేశారు.

నగరాభివృద్ధికి కృషి చేయాలి



ఉద్యోగులతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నగరపాలక సంస్థకు బదిలీపై వచ్చిన వివిధ విభాగాల ఉద్యోగులు మంగళవారం మంత్రిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో కొద్దిసేపు సమీక్షించిన మంత్రి పలు సూచనలు చేశారు. ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టే పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాఖాపరంగా ప్రజలకు పారదర్శక సేవలు అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

దీపావళి సమయంలో అప్రమత్తత అవసరం

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: దీపావళి పండగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా అన్ని విభాగాలు అప్రమత్తంగా ఉండాలని మచిలీపట్నం ఆర్డీవో స్వాతి స్పష్టం చేశారు. ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన ఆర్డీవో పలు సూచనలు చేశారు. బాణసంచా దుకాణాలకు లైసెన్సులు, విక్రయాలు తదితరాల విషయంలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని చెప్పారు. పండగ సందర్భంగా ఏ ఒక్కరూ ప్రమాదాల బారిన పడకుండా అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. బాణసంచా దుకాణాల ఏర్పాటు విషయంలో కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలను పాటించాలన్నారు. దుకాణాల్లో బాలకార్మికులు లేకుండా తనిఖీలు చేపట్టాలని చెప్పారు. మచిలీపట్నం, అవనిగడ్డ సీఐలు అబ్దుల్‌నబీ, యువకుమార్, పెడన మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, అగ్నిమాపక, విద్యుత్తు, తదితర శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

స్త్రీ, శిశుసంక్షేమశాఖ కేంద్రాల్లో పరిశీలన

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: జిల్లా స్త్రీ,శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తున్న వివిధ కేంద్రాలను మంగళవారం జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య సందర్శించారు. సఖి వన్‌స్టాప్ సెంటర్, బాలికల సదన్, శిశుసదన్‌లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీసి అధికారులకు పలు సూచనలు చేశారు. న్యాయవాది అజ్మతున్నీసా, ఆయా కేంద్రాల అధికారులు విజయలక్ష్మి, అచిష్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగునకు కృషి

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలో పలు ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో వై.వి.హరనాథ్ మంగళవారం తనిఖీలు చేశారు. గురువిందగుంట, ముచ్చిలగుంట, మర్రిగుంట ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, సమయపాలన చూశారు. విద్యా సామర్థ్యాల్ని పరీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు సంఖ్య పెంచాలని, విద్యా ప్రమాణాలు మెరుగునకు కృషి చేయాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు.

రేషన్ రాబందులపై ఉక్కుపాదం

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

- వైకాపా హయాంలో యథేచ్ఛగా అక్రమ తరలింపు
- తెదేపా ప్రభుత్వంలో అక్రమార్కులకు అడ్డుకట్ట

పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న బియ్యం అక్రమార్కులకు పరమాన్నంగా మారుతోంది. రెవెన్యూ విభాగం, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు ఇలా వివిధ విభాగాలు బియ్యం అక్రమ తరలింపుపై నిఘా ఉంచినా వైకాపా నేతల అండ ఉండడంతో అక్రమ వ్యాపారం యథేచ్ఛగా సాగింది. తెల్లరేషన్ కార్డుదారులకు ప్రభుత్వం రాయితీపై ఇచ్చే బియ్యం కోసం ఎదురుచూసే పేదలు చాలా మంది ఉన్నా, ఇంకొంత మంది తమకు వచ్చిన బియ్యాన్ని నిల్వ పెట్టుకోలేక ఎంతో కొంతకు విక్రయించడం అక్రమ తరలింపునకు కారణం అవుతోంది.

గోదాముల్లో నిల్వ చేసి..

కొనుగోలు చేసిన బియ్యాన్ని గోదాములు, ఇళ్ల వద్ద నిల్వ ఉంచి రెట్టింపు ధరకు విక్రయించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. బందరు నియోజకవర్గమే కాదు పెడన నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పెడన పట్టణంలో అయితే అక్రమంగా రేషన్ బియ్యం నిల్వలు, తరలింపుపై పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో వివిధ గ్రామాల్లో కొందరు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి వేరే ప్రాంతాల్లో అధిక మొత్తం ధరకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి అక్రమార్కులు రూ.లక్షల్లో దండుకున్నారు.



డ్రైవర్స్ కాలనీలోని ఓ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న పౌరసరఫరాలశాఖ అధికారులు

కూటమి హయాంలో...

❖ ఇటీవల నగరంలోని జగన్నాథపురంలోని ఓ రైస్‌మిల్లులో రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్న సమాచారం అధికారులకు తెలిసింది. అక్కడకు వెళ్లి తనిఖీలు చేయగా మిల్లు నుంచి సుమారు 210 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా తెలంగాణకు తరలించేందుకు సిద్ధమైనట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని మిల్లు యజమానిపై కేసు నమోదు చేశారు.

❖ ఈ నెలలో నగరంలోని చింతచెట్టు సెంటరు వద్ద ఓ వ్యక్తి ప్రజల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా అధిక ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులు వెళ్లి గుర్తించడంతో పాటు 166 బస్తాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

❖ ఈ నెల 16న డ్రైవర్స్ కాలనీలోని రేషన్ దుకాణంపై వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేయగా రికార్డుల్లో నమోదు చేసిన నిల్వల కంటే క్షేత్రస్థాయిలో 433 కేజీల బియ్యం, 12 పంచదార ప్యాకెట్లు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో దుకాణాన్ని సీజ్ చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ❖ ఇలా బందరు నియోజకవర్గ వ్యాప్తంగా ఇటీవల రేషన్‌బియ్యం అక్రమ తరలింపుపై ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాలతో దాడులు ముమ్మరం చేయడంతో అక్రమార్కుల్లో అలజడి మొదలైంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఎంత నిఘా పెట్టినా ఎన్ని దాడులు చేసినా రేషన్ బియ్యం అక్రమ తరలింపులు మాత్రం ఆగలేదు.



జగన్నాథపురంలోని ఓ మిల్లులో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం బస్తాలను లెక్కిస్తున్న సిబ్బంది

5 నెలల వ్యవధిలో 25కేసులు

ప్రస్తుత కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖను ప్రక్షాళన చేసేదిశగా చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కేవలం బందరు నియోజకవర్గంలో 25 కేసులు నమోదయ్యాయి. బందరు నగరంతో పాటు మండలంలోని శిరివెళ్లపాలెం, మంగిపూడి, పెదపట్నం తదితర ప్రాంతాల్లో దాడులు చేసి కేసులు నమోదు చేశారు.



ఇంట్లో అక్రమంగా బియ్యం బస్తాల నిల్వ

పింగళి నామకరణం.. చారిత్రాత్మకం



పింగళి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కూటమి నాయకులు, వివిధ పక్షాల ప్రతినిధులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలకు జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య నామకరణం చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రభుత్వం వైద్య కళాశాలకు పింగళి పేరు పెట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తూ నేతాజీ మిత్ర మండలి ఆధ్వర్యంలో మంగళవారం చిలకలపూడి పోలీస్‌స్టేషన్ ప్రాంతంలోని పింగళి విగ్రహానికి పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు బండి రామకృష్ణ, తెదేపా రాష్ట్ర నాయకులు గొర్రెపాటి గోపీచంద్‌లు మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల సేవలను గుర్తించి భావితరాలకు ఆదర్శంగా ఉండేలా కృషి చేస్తోందన్నారు. దీనిలో భాగంగానే ఎంపీ బాలశౌరి కోరిన వెంటనే వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య నామకరణం చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడంతో పాటు ఆ వెంటనే ఉత్తర్వులు జారీ చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధి చాటుకుందన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కూటమి నాయకులు, వివిధ పక్షాల ప్రతినిధులు పీవీ ఫణికుమార్, హరికృష్ణ, సుబ్బారావు, మోజెస్, శర్మ, సుబ్రహ్మణ్యం, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీసు విధులపై చైతన్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై గణేష్‌కుమార్

బంటుమిల్లి, న్యూస్‌టుడే: పోలీస్‌స్టేషన్ విధి విధానాలు, నిర్వహణలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బంటుమిల్లి ఎస్సై గణేష్‌కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాల సందర్భంగా మంగళవారం మండలంలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. వారికి స్టేషన్‌లో రికార్డుల ప్రక్రియ, కేసుల నమోదు, నేర నియంత్రణ, సాంకేతికతను వినియోగించి ఏ విధంగా కేసులు ఛేదిస్తారో వివరించారు. ఆయుధాలు, సిబ్బంది వాడే ఉపకరణాలు చూపించారు.



ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎస్పీ తదితరులు

ప్రసాద్ సేవలు ఆదర్శనీయం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఏఆర్ ఏఎస్పీగా జిల్లాలో విధులు నిర్వహిస్తూ విజయవాడ సిటీ సెక్యూరిటీ వింగ్ ఎస్పీగా పదోన్నతిపై వెళ్తున్న ప్రసాద్ సేవలు ఆదర్శనీయమని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. మంగళవారం నిర్వహించిన ప్రసాద్ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డీఎస్పీ అబ్దుల్‌సుభాన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, రంగనాథ్, ఏవో సుబ్రహ్మణ్యం, ఏఏవో విజయ్‌కుమార్, ఎస్పీ సీసీ హనుమాన్‌సింగ్ తదితరులు పాల్గొని ప్రసాద్‌ను సత్కరించారు.

పరిశుభ్రత కార్యక్రమాలు ప్రారంభం

ఒన్నారెకానూరు (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: బంగారు బందరుగా తీర్చిదిద్దేందుకు శ్రమిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర స్ఫూర్తితో బందరు మండలం ఒన్నారెకానూరులో స్వచ్ఛంద శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామంలోని పిచ్చిమొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరు భావిస్తే పల్లెలు సుందరంగా రూపు దిద్దుకుంటాయన్నారు. డి.మహేష్, జి.వెంకటరమణ, బి.నాని తదితరులు పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న గోపు సత్యనారాయణ

సినిమాలు

రేవతి: వేట్టయన్, **సిరివెంకట్:** దేవర
సిరికృష్ణ: విశ్వం, **రామరాజు:** జనక అయితే గనక –మచిలీపట్నం, కార్పొరేషన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం



నగరంలోని దేవునిచెరువు వినాయక గుడి ప్రాంతంలోని సందులో విద్యుద్దీపం తెగి వేలాడుతోంది. గత కొన్ని రోజులుగా ఇలాగే ఉన్నా సిబ్బంది పట్టించుకోకపోవడంతో స్థానికులు సమస్యను మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఈనాడులో వార్త ప్రచురించి కమిషనర్ బాపిరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి విద్యుద్దీపం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. గతకొన్ని రోజులుగా రాత్రిపూట రాకపోకలకు ఇబ్బందిపడుతున్న స్థానికులు ఎట్టకేలకు విద్యుద్దీపం ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

? నగరంలోని బచ్చుపేట ప్రాంతంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ప్రహరీలు సైతం దూకి ఇళ్లల్లోకి రావడంతో పాటు దాడి చేస్తున్నాయి. అధికారులు స్పందించి వాటిని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– కుమారి, బచ్చుపేట

✔ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనిలో భాగంగా పశుసంవర్ధకశాఖ అధికారులతో కూడా సమీక్షించాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సమస్య పరిష్కరించేలా కృషి చేస్తాం. **-బాపిరాజు, నగర పాలక సంస్థ కమిషనర్, మచిలీపట్నం**

–మచిలీపట్నం(గొడుగుపేట),గూడూరు, న్యూస్‌టుడే



ఉద్యోగాలకు ఎంపికైన వారిలో అధికారులు

జాబ్ మేళాకు పాక్షిక స్పందన

పెడన, న్యూస్‌టుడే: స్థానిక బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్కిల్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు నిరుద్యోగుల నుంచి పాక్షిక స్పందన లభించింది. ఈ మేళాకు పదికి పైగా సంస్థలు హాజరవుతున్నట్లు ప్రకటించినా అందులో సగం కూడా రాకపోవడంతో నిరుద్యోగులు నిరాశ చెందారు. మేళాకు 143 మంది నిరుద్యోగులు హాజరుకాగా 13 మంది మాత్రమే ఎంపికయ్యారు. ఇంటర్మీడియట్ జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పీబీ సాల్మన్‌రాజు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రూపా నాగశ్రీ, స్కిల్ సెంటర్ కోఆర్డినేటర్ వంగా బాబు తదితరులు పాల్గొన్నారు.జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారితో పాటు జిల్లా ఉపాధి కల్పనాధికారిలు హాజరుకాలేదు.

నాటుసారాకు అడ్డాగా డీటీ పాలెం

న్యూస్‌టుడే, పెడన



నాటుసారా తయారీలో యువకుడు

పెడనలోని దక్షిణ తెలుగు(డీటీ)పాలెం నాటుసారా తయారీ, విక్రయాలకు కేంద్రంగా మారింది. గత కొద్ది నెలలుగా ఈ ప్రాంతంలో నాటుసారాను విచ్చలవిడిగా తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. కొంత మంది తయారీదారులు ఇతర ప్రాంతాలకు కూడా రవాణా చేస్తున్నారు. గతం నుంచి ఈ ప్రాంతం నాటుసారాకు ప్రసిద్ధి చెందింది. ఎక్సైజ్, పోలీసు అధికారులు సంయుక్తంగా పలు మార్లు కార్డన్ సెర్చ్ నిర్వహించి వేలాది లీటర్ల బెల్లపు ఊట, వందల లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. బాధ్యులపై కేసులు కూడా నమోదు చేశారు. అయినప్పటికీ పరివర్తన రాలేదు. కొద్ది నెలలుగా తయారీని రెట్టింపు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. నాటుసారా తయారీకి అవసరమైన నల్లబెల్లాన్ని ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు సమాచారం.

పెడనలోని కలంకారీ పరిశ్రమలో రంగుల తయారీకి నల్లబెల్లాన్ని వినియోగిస్తారు. కలంకారీ సాకు చూపుతూ నల్లబెల్లాన్ని భారీగా దిగుమతి చేస్తున్నారు.డీటీ పాలెం ప్రాంతానికి సరిహద్దు నుంచి రామరాజుపాలెం బ్రాంచి కాలువ ప్రవహిస్తోంది. ఈ కాలువ గట్టు కేంద్రంగా బట్టీలు వెలిసినట్లు సమాచారం. కొంత మంది సామాజిక మాధ్యమాల్లో బట్టీల ఫొటోలు కూడా పెట్టటం విశేషం. ఒక్కరాత్రి బట్టీలోకి పనికి వెళితే రూ.వెయ్యి వరకు కూలీగా ముట్టచెబుతున్నట్లు సమాచారం. దాడులు జరిగితే తమకు సంబంధం లేదని నిర్వాహకుడు ముందే స్పష్టం చేస్తున్నట్లు తెలిసింది.అధిక మొత్తంలో కూలీ రావడంతో సాహసం చేసి వెళ్తున్నారు.ఇటీవల పెడన పోలీసులు డీటీపాలేనికి సరిహద్దున ఉండే వైఎస్‌ఆర్ కాలనీలో బట్టీని పట్టుకుని నిర్వాహకుడ్ని రిమాండ్‌కు పంపించారు. అయినప్పటికీ ఖాతరు చేయకుండా మరిన్ని బట్టీలు వెలిసినట్లు తెలిసింది. కుటీర పరిశ్రమగా మారిన నాటుసారా తయారీ, విక్రయాలను కట్టడి చేయాలని ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై నిఘా ఉంచి కట్టడి చేస్తామని రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్ చెప్పారు.

క్యాంప్‌బెల్‌పేటలో సమస్యల పరిష్కారానికి అడుగులు

కరఅగ్రహారం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: బందరు మండలం కరఅగ్రహారం శివారు క్యాంప్‌బెల్‌పేటలో అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ డి.కె. బాలాజీ ఇటీవల పలు శాఖల అధికారులను ఆదేశించారు. మంత్రి కొల్లు రవీంద్ర అందించిన పిటిషన్‌పై కలెక్టర్ స్పందిస్తూ క్యాంప్‌బెల్‌పేటలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈని, గ్రామం మొత్తానికి డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని డీపీవోను, చేపల చెరువుల నిమిత్తం 800 ఎకరాల ఖాళీ భూమిని గుర్తించి 500 మంది లబ్ధిదారులకు కేటాయించాలని మచిలీపట్నం ఆర్డీవోను, క్యాంప్‌బెల్‌పేట నుంచి ఫిషింగ్‌హార్బర్‌కు రోడ్ కనెక్టివిటీ ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ ఎస్‌ఈని, గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదలు 130 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని మచిలీపట్నం ఆర్డీవోను ఆదేశించారు. తన ఆదేశాలను అత్యవసరమైన వాటిగా గుర్తించి పనులు పూర్తి చేయాలని సూచించారు.



నివాసాల చెంతకు వచ్చిన సముద్రపు నీరు(పాతచిత్రం)

ప్రకృతి సాగుతో ఆరోగ్యవంతమైన సమాజం

తరకటూరు(గూడూరు), న్యూస్‌టుడే: ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటుకు ప్రకృతి సాగు ఎంతగానో దోహదపడుందని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.పార్థసారథి అన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తరకటూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.ఏవో శివప్రసాద్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు పరిష్కారం

పెడన, న్యూస్‌టుడే: స్థానిక బంటుమిల్లి రోడ్డులో తహసీల్దార్ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో ముంపు సమస్యకు పరిష్కారం లభించింది. ఈప్రాంతంలో దాదాపు నాలుగు వార్డులు వర్షాల సీజన్‌లో ముంపునకు గురవుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ సమగ్రంగా లేకపోవటం, కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణలు ముంపుకు దారితీస్తున్నట్లు గుర్తించిన ప్రజాప్రతినిధులు, అధికారులు జయలక్ష్మీ సొసైటీ రోడ్డు నుంచి చూజీ కంపెనీ వరకు, ఆ తర్వాత ఎంజేఆర్ కాలనీ రోడ్డులో కచ్చా డ్రెయిన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించి మంగళవారం పనులు మొదలుపెట్టారు. 8వ వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్, మున్సిపల్ ఏఈ కాగిత సీతారామాంజనేయులు తదితరులు పర్యవేక్షించారు.

రైతుబజార్‌లో రాయితీపై వంట నూనె

పెడన, న్యూస్‌టుడే : స్థానిక రైతు బజార్‌లో రాయితీపై వంట నూనెల విక్రయాలు ప్రారంభమయ్యాయి. పెడన పట్టణ కిరాణా మర్చంట్స్ ఆధ్వర్యంలో నడుస్తోన్న ఈ కౌంటర్‌లో.. పామాయిల్ లీటరు రూ.125లు మార్కెట్ ధర కాగా రూ.110లకు, సన్ ఫ్లవర్ ఆయిల్ లీటరు రూ.138లు కాగా.. రూ.124లకు రాయితీపై విక్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విక్రయాలు ప్రారంభించామని మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొలిశెట్టి బాలరాజు తెలిపారు. వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోందని రైతుబజారు ఎస్టేట్ అధికారి అమీర్ చెప్పారు.

ఇంతేరు గ్రామానికి సముద్రం ముప్పు

కొట్టుకుపోయిన తీరానికి వెళ్లే దారి

న్యూస్‌టుడే, ఇంతేరు (కృత్తివెన్ను)

మండలంలోని తీరప్రాంతమైన ఇంతేరు గ్రామానికి సముద్రపు ఆటుపోటులకు గ్రామం నుంచి తీరానికి వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. నిత్యం వందల సంఖ్యలో సముద్రంపైకి వేటకు వెళ్లే మత్స్యకారులు ఈ రహదారి పైనుంచే వెళ్లాల్సి ఉంది. అదే గ్రామ పంచాయతీలోని పార్వతీపురం గ్రామానికి వెళ్లే రహదారి కూడా కోతకు గురై వర్షాలకు మొత్తం రోడ్డు కొట్టుకుపోవడంతో గ్రామస్థులకు ఇబ్బందికరంగా మారింది. ఇంతేరు గ్రామ పంచాయతీలోని ఇంతేరు, సత్రపాలెం, పార్వతీపురం గ్రామాలు ఉన్నాయి. 3వేల జనాభా ఉంది. మత్స్యకారులు అధికంగా ఉన్న ఈ గ్రామం నుంచి సముద్రంలో వేటకు వెళ్తుంటారు. ఆ రహదారి ధ్వంసం కావడం మత్స్యకారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు సముద్రం పోటు ఎక్కువగా ఉండడంతో మత్స్యకారులంతా ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో తుపాను రక్షిత కేంద్రంలో సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.



కొట్టుకుపోయిన దారి



వర్షానికి, సముద్రపు పోటుకు ఇంతేరు పార్వతీపురం మధ్య రోడ్డు ఇలా..

రోడ్డు నిర్మించి ఆదుకోండి



ఇంతేరు గ్రామానికి రహదారులు నిర్మించండి. వీలైనన్ని నిధులు కేటాయించి గ్రామంలోని రోడ్లన్నీ శాశ్వత పరిష్కారంగా పటిష్టం చేయండి. తీరగ్రామం కావడంతో నిత్యం రాత్రీపగలు వేటకు వెళ్తాం. సముద్రం ఆటుపోటులకు గ్రామం కోతకు గురవుతోంది. కోతను అరికట్టడానికి గ్రామం చుట్టూ రివిట్‌మెంట్ ఏర్పాటు చేయండి. గ్రామానికి రక్షణ కల్పించండి.

– తమ్ము అంజనేయులు, ఇంతేరు గ్రామస్థుడు

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

ఉత్సాహంగా ప్రతిభాపాటవ పోటీలు

పోరంకి, పెనమలూరు, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం రెండు పాఠశాలల్లో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలకు మంచి స్పందన లభించింది. 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై జరిగిన వ్యాస రచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

★ పోరంకి ఎన్ఆర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో సీహెచ్ తేజస్విని (8), పి. వైష్ణవి (9), కె. హేమ చరణ్ (9) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ ఆర్. ఎస్. ఎన్ ప్రసాద్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఉషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ★ యనమలకుదురు విజయ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో సీహెచ్ నిత్య, వి.ఐశ్వర్య, టి.దేవీప్రియ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి ఉపాధ్యాయులు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులను అందజేశారు.



పోరంకి: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్ ప్రసాద్



పెనమలూరు: ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

1. పోరంకి ప్రభునగర్ శ్రీనగర్ కాలనీలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుందని నివాసితులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్త తీసి డంపింగ్ యార్డ్‌కు పంపించారు.

2. విజ్ఞాన్ భారత్ స్కూల్ రోడ్డు ఏరియా వీధులు శుభ్రంగా లేవని నివాసితులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూర్యవర్ధన్ దృష్టికి 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా తీసుకెళ్లగా, స్పందించిన ఆయన వంశీ, సరళ పర్యవేక్షణలో సిబ్బందిని పంపి వీధులను శుభ్రం చేయించారు. స్థానిక నివాసితులు ఆనందం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, పోరంకి**

? గన్నవరం గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. **- నాగేశ్వరరావు, గన్నవరం**

✔ వెంటనే తగు చర్యలు తీసుకుంటాం. - చెన్నకేశవరావు, పంచాయతీ ఈవో - **న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్**

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పోరంకి, న్యూస్‌టుడే: పోరంకి 11 కేవీ సెక్షన్ పరిధిలోని విశ్వసాయి నగర్, రాజమాత నగర్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా బుధవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈఈ పి. హరిబాబు, గుణదల, పోరంకి ఏఈ సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. 100 అడుగుల రోడ్డు, పోరంకి, నిడమానూరు రోడ్ ఏరియాలో గల రైతులు, స్థానికులు సహకరించాలని కోరారు.

శిథిల భవనాలు.. పాములకు నిలయాలు

కంకిపాడు, న్యూస్‌టుడే

కంకిపాడులో నివాస గృహాలు, పాఠశాలలు, దుకాణ సముదాయాలకు మధ్యలో ఉన్న ప్రభుత్వ శిథిల భవనాలు స్థానికులను భయ పెడుతున్నాయి. ఆవరణలు చిట్టడవుల్లా తయారై.. లోపలి భాగం పాము పుట్టలకు నెలవైంది.

★ కంకిపాడు పాత సీహెచ్‌సీ భవనం పూర్తిగా పాడైంది. రెండేళ్లుగా గాలికి వదిలేయడంతో కాలు పెట్టడానికి వీల్లేని విధంగా తయారైంది. దీనికి చుట్టూరా ఉన్న నివాస గృహాల్లోకి విషపు పురుగులు ప్రవేశిస్తున్నాయి స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖకు చెందిన దాదాపు 30 సెంట్ల స్థలం విలువ రూ.5 కోట్ల వరకు ఉంటుందని అంచనా. దీనిలో పీహెచ్‌సీ భవనం నిర్మించాలని కోరుతున్నారు

★ బందరు రోడ్డు పక్కన రహదారి బంగ్లా శిథిలమై పదేళ్లు దాటింది. దీనిలో పదుల సంఖ్యలో పెద్ద పాముల పుట్టలు దర్శనమిస్తున్నాయి. సరిహద్దున రైతు బజార్, ఎంపీపీ, జడ్పీ ఉన్నత పాఠశాల, కార్ల స్టాండ్, నివాస గృహాలున్నాయి. పాములు, తేళ్లు, జర్రుల వంటివి భయ పెడుతున్నాయి. రోడ్లు-భవనాల శాఖకు చెందిన ఈ స్థలం విలువ రూ.10 కోట్లకు పైగా ఉంటుంది.

★ గన్నవరం రహదారి సమీపంలో ఉన్న బాలుర వసతి గృహాన్ని మూసేసి మూడేళ్లయింది. చుట్టూరా దుకాణాలు, నివాసాలున్నాయి. ఇక్కడే పైన దుస్థితే నెలకొంది. సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన ఈ స్థలం విలువ రూ.70 లక్షలకు పైగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.



నివాస గృహాల మధ్యలో శిథిలమైన సీహెచ్‌సీ పాత భవనం



ఆర్అండ్‌బీ బంగ్లా..

సౌరశక్తి ప్లాంట్లలో తనిఖీ

ఉయ్యూరు, న్యూస్‌టుడే : లోవోల్టేజీ, లూజు కనెక్షన్లు లేకుండా ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ ఎం.సత్యానందం అన్నారు. ఉయ్యూరు, గండిగుంటలో మంగళవారం పర్యటించి విద్యుత్తు ఉప కేంద్రాలు, కార్యాలయంలో రికార్డులు, సౌరశక్తి ప్లాంట్లను తనిఖీ చేశారు. అనంతరం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై వినియోగదారులకు అవగాహన కల్పించారు.

విమానాల అత్యవసర ల్యాండింగ్

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకోవాల్సిన రెండు విమానాలు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం అత్యవసర ల్యాండింగ్ అయ్యాయి. సాంకేతిక కారణాలను గోవా, దిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకోవాల్సిన 6ఈ712(ఇండిగో), ఏఐ417(ఎయిర్‌ఇండియా) సర్వీస్‌లను విమానయానశాఖ అధికారులు విజయవాడ వైపునకు దారిమళ్లించారు. వాతావరణం అనుకూలించిన అనంతరం తిరిగి హైదరాబాద్‌కు ఆయా సర్వీస్‌లు బయలుదేరి వెళ్లాయి.

ప్రభుత్వం ధన్వంతరి జయంతిని నిర్వహించాలని వినతిపత్రం

కానూరు, పెనమలూరు, న్యూస్‌టుడే: నాయీ బ్రాహ్మణుల ఆరాధ్య దైవం, ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా నాయీ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు మంగళవారం మంత్రి పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. వందడుగుల రహదారిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సంఘ ప్రతినిధులు కలిశారు. 2016 అక్టోబరు 28 నుంచి కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో ధన్వంతరి ఉత్సవాలు ఘనంగా నిర్వహించి వైద్యవృత్తిలో విశేష ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు సైతం అందజేస్తున్నారని మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు వి.సుభద్రాదేవి, తెన్నేటి సోమశేఖర్, పి.రాంప్రసాద్, ఎ.సుబ్బారావు, యలమందరావు, మహేష్, గణపతిరావు, ప్రకాష్, మురళీకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పార్థసారథికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

విదేశీ పర్యటనకు ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: నూతన రాజధాని అమరావతి అభివృద్ధిలో భాగంగా గన్నవరంలో ఐటీ రంగం వృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని.. స్థానికంగా ఉన్న సదుపాయాలను అమెరికాలోని పెట్టుబడుదారులకు వివరిస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ప్రవాసాంధ్రులైన ఎమ్మెల్యే వెంకట్రావు గతంలో అమెరికాలోని తన వ్యాపార కార్యకలాపాలను చూసుకునేవారు. ఐటీ ప్రముఖులతో మంత్రి లోకేశ్‌తో కలిసి రాష్ట్రంలో పెట్టుబడుల విషయమై సమావేశమయ్యేందుకు మంగళవారం విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. హైదరాబాద్ మీదుగా అమెరికాలోని డల్లాస్‌కు తరలి వెళ్లారు. నవంబరు 5న తిరిగి రాష్ట్రానికి చేరుకుంటానని వెల్లడించారు.

ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో కంకిపాడు పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించారు. మంగళవారం ఈడుపుగల్లు పరిధిలోని శ్రీచైతన్య విద్యాసంస్థల్లోని శ్రీప్రదభవన్‌లో మచిలీపట్నానికి చెందిన రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ మురళీకృష్ణ ఎస్సై సందీప్, చైతన్య కళాశాల ఏజీఎం రవీంద్ర పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మంగళవారం హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోలీసు విధులు, ఆయుధాల గురించి ప్రత్యక్ష అవగాహన కల్పించారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ మురళీకృష్ణ, పక్కన ఎస్సై సందీప్ తదితరులు

గ్రామ సభ రసాభాస

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పెరికీడులో మంగళవారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం గ్రామసభ రసాభాసగా ముగిసింది. గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించి మండలంలో సామాజిక తనిఖీ ప్రక్రియ చేపట్టారు. అధికారులు ఉదయం సభ ప్రారంభించిన తర్వాత ఉపాధి హామీ పథకం ఎఫ్ఏ వ్యవహారాన్ని కొందరు నాయకులు లేవనెత్తారు. ఎఫ్ఏ పలు అవకతవకలకు పాల్పడుతున్నారని, స్థానికంగా లేని వారికి కూడా మస్తర్లు వేసి, వేతనాలు స్వాహా చేస్తున్నట్లు ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. రాజకీయ కారణాలతో తనపై విమర్శలు చేస్తున్నారని, తన ఉద్యోగం తొలగించేందుకు కొందరు నాయకులు ప్రయత్నిస్తున్నట్లు ఎఫ్ఏ ప్రత్యారోపణలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు, గ్రామస్థులు రెండు వర్గాలుగా విడిపోయి వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా ఎఫ్ఏ మద్దతుదార్లు తనపై దాడికి దిగినట్లు తెదేపా నాయకుడు సింగవరపు ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గందరగోళం నడుమ అధికారులు సభను అర్థాంతరంగా ముగించారు.

కబేళా ఏర్పాటు

ఉయ్యూరు, న్యూస్‌టుడే : ఉయ్యూరులోని హిందూశ్మశానం చెరువు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో రూ. 30 లక్షలతో నిర్మాణ పనులు జరుగుతున్న కబేళాను ఉయ్యూరు నగర పంచాయతీ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉయ్యూరు మాంసం మార్కెట్‌లో జీవాలను కోయడం వల్ల దుకాణదారులు, వినియోగదారులకు, స్థానికులకు అసౌకర్యంగా ఉండేదన్నారు. పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో కబేళా ఏర్పాటు చేశామని, త్వరలో పనులు పూర్తయి వినియోగంలోకి వస్తుందని తెలిపారు. దుకాణదారులు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కబేళాను పరిశీలిస్తున్న ఉయ్యూరు నగర పంచాయతీ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ

మామిడి మొక్కల తొలగింపు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం మండలం కొండపావులూరులో దాదాపు 119 ఎకరాల ప్రభుత్వ భూమిని జగనన్న కాలనీకి కేటాయించారు. కేటాయించిన భూమిలోని సుమారు 20 ఎకరాలను ప్రభుత్వ పాఠశాల, కార్యాలయాల ఏర్పాటుకు నిర్ణయించారు. కార్యాలయాలు, పాఠశాల ఇతర ప్రభుత్వ అవసరాల నిమిత్తం విడిచిపెట్టిన భూమిలో గతంలో తాము సాగుచేసే వాళ్లమని. . తమకు ఎటువంటి పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం భూమిని అర్ధంతరంగా తీసుకుందంటూ రైతులు ఇటీవల మామిడి మొక్కలు నాటారు. ఆగిరిపల్లి మండలం కనసానపల్లికి చెందిన ఇరవై మంది రైతులు జగనన్న కాలనీ స్థలంలో మొక్కలు నాటారంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. స్థానికంగా లేఔట్‌ను వీఆర్వో గోపాలరావుతో కలిసి మంగళవారం పరిశీలించిన తహసీల్దార్ శివయ్య.. పోలీసుల సమక్షంలో మామిడి మొక్కలను తొలగించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సమయంలో మొక్కలు నాటడం చట్ట విరుద్ధమని.. ఏదైనా పరిహారం ఇతర హామీల విషయమై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రెవెన్యూ అధికారులు వెల్లడించారు.



వినూత్న ఆలోచనలను ప్రోత్సహించాలి

వీరపనేనిగూడెం(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించాలని.. సాంకేతికత అందిపుచ్చుకొని నూతన ఆవిష్కరణల దిశగా చర్యలు చేపట్టాల్సిన ఎంతైనా ఉందని జిల్లా విద్యాశాఖాధికారిణి తాహెరా సుల్తానా సూచించారు. గన్నవరం మండలం వీరపనేనిగూడెం డా. బీఆర్.అంబేడ్కర్ గురుకులం(బాలికల)లో జిల్లాస్థాయి సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలల జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని 14 బాలబాలికల గురుకులాల నుంచి 228 మంది విద్యార్థులు రూపొందించిన ఐదు విభాగాల్లో 160 ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ వై.యశోదలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సొసైటీ ఏఎంఓ టీమ్ సభ్యురాలు శాంతివిశాల, డీసీవో ప్రేమావతితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారిణి తాహెలా సుల్తానా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఎంఈవో రవికుమార్, ఇతర అతిథులతో కలిసి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో పరిసర ప్రాంత హెచ్‌ఎంలు విజయ్, జగదీశ్వరరావు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాల పరిశీలన

ఈడుపుగల్లు (కంకిపాడు): డివిజన్ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉయ్యూరు డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) రాజేష్ సూచించారు. దీనిలో భాగంగా ఈడుపుగల్లులో ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాన్ని మంగళవారం పరిశీలించారు.

భక్తులకు అన్నదానం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఏలూరుకు చెందిన కె.భరత్‌కుమార్ ఆధ్వర్యంలో 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్, కంప్యూటర్ పరికరాల చోరీ

పెనమలూరు, న్యూస్‌టుడే: కంప్యూటర్ సర్వీస్ సెంటర్ తాళాలు పగులగొట్టి ల్యాప్‌టాప్, కంప్యూటర్ పరికరాలు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ముళ్లపూడి రమేష్‌నాయుడు తాడిగడప లిమ్రాకాలనీ నివాసి. ఆయన కానూరులో కంప్యూటర్ సర్వీస్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఈనెల 20న దుకాణం మూసి వేసి మరుసటి రోజు వచ్చి చూడగా దుకాణం షట్టర్లు పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. మూడు ల్యాప్‌టాప్‌లు, ఇతర కంప్యూటర్ పరికరాలు చోరీ అయినట్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరిహద్దు వివాదంలో దాడి

పెనమలూరు, న్యూస్‌టుడే: సరిహద్దు వివాదంలో ఇరువర్గాలు దాడులకు దిగిన ఘటనపై కేసులు నమోదయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. తోటకూర త్రినాథ్ పోరంకి ప్రభునగర్ నివాసి. అతనికి పోరంకి తూములకూడలి వద్ద స్థలం ఉంది. ఇక్కడ ప్రహరీ గోడ నిర్మాణం జరుగుతుండడంతో ఈనెల 21న పనుల పర్యవేక్షణకు వెళ్లాడు. ఈలోగా అక్కడకు సరిహద్దు దారు తోటకూర రామ్మోహనరావు, శేషుకుమారి దంపతులు వచ్చారు. తమ ఇంటి గోడకు ఆనించి సరిహద్దు గోడ కడుతున్నావంటూ వివాదానికి దిగారు. ఆగ్రహంతో భార్యభర్తలు తిడుతూ త్రినాథ్‌పై కొడవలితో దాడి చేశారు. ఘటనలో త్రినాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ మంగళవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేశారు. కాగా ఇదే సంఘటనపై రామ్మోహనరావు తమపైనే త్రినాథ్ దాడి చేశారని దంపతుల ఫిర్యాదు మేరకు పోలీసులు త్రినాథ్‌పై కేసు నమోదు చేశారు.

మిత్రులే.. అంతలోనే శత్రువులై..!

హత్యకు దారితీసిన స్వల్ప వివాదం

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : వారిద్దరూ స్నేహితులు. చిన్నపాటి వివాదంతో ఘర్షణపడ్డారు. ఒకరిమీదకు మరొకరు దూసుకెళ్లారు. శత్రువుల్లా కొట్టుకునే క్రమంలో.. ఒకరు ప్రాణాలు కోల్పోయిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌కు చెందిన వెంకట నరసింహరాజు ఫార్మసీ మందుల దుకాణాలు నిర్వహిస్తుంటారు. ఈయనకు విజయవాడ, అయోధ్యనగర్‌లోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్ ఉంది. యనమలకుదురుకు చెందిన మహ్మద్ రఫీ (54), నరసింహరాజులు స్నేహితులు. వీరిద్దరూ సోమవారం అర్ధరాత్రి ఫ్లాట్‌కు వచ్చారు. కలిసి మద్యం తాగారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య చిన్న విషయమై గొడవ జరిగింది.

మాటామాటా పెరగడంతో.. రఫీ కత్తెర తీసుకుని పొడవబోయాడు. నరసింహరాజు తప్పించుకుని.. రఫీ మెడకు టవల్ వేసి నులమడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన అనంతరం నరసింహరాజు.. పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సమాచారం చెప్పారు. అజిత్‌సింగ్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు తదితరులు వచ్చి విచారించారు. రఫీ తనను రూ.3 లక్షలు అప్పు అడిగాడని, ఈ విషయంలో డబ్బులు ఎందుకు పాడు చేస్తావంటూ మందలించానని నరసింహరాజు చెబుతున్నారు. రఫీ.. మద్యం మత్తులో కత్తెర తీసుకుని మీదకు వస్తే మెడకు టవల్ వేసి అడ్డుకున్నానని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే అతడు మరణించి ఉంటాడని పోలీసులు తెలిపారు. దీనిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

ప్రతిభాపాటవ పోటీలకు స్పందన



వ్యాసరచన పోటీల్లో చిన్నారులు



విజేతలతో ప్రధానోపాధ్యాయిని పద్మావతి

'ఈనాడు' ఆధ్వర్యంలో గుడివాడ రాజేంద్రనగర్‌లోని మాంటిస్సోరి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీలకు చక్కని స్పందన లభించింది. అంతర్జాల వినియోగం, లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థిని వి.హరిణి, పదో తరగతి విద్యార్థులు జి.రూప, ఎస్.శరణ్యలు విజేతలుగా నిలవగా.. పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.పద్మావతి వారికి బహుమతులు అందజేశారు.

- న్యూస్‌టుడే, గుడివాడ గ్రామీణం

కాలువల అభివృద్ధికి రూ.7.73 కోట్లు



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలోని పంట, మురుగు కాలువలు పూడిక తీయలేదని పంట పొలాలు చిన్న వర్షాలకు సైతం ముంపుబారిన పడి రైతుల తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మంగళవారం తన స్వగృహంలో ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పడుతున్న కష్టాలను గుర్తించి కాలువల అభివృద్ధికి అధికారులతో కలిసి ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం రూ.7.73 కోట్లు మంజూరు చేసిందన్నారు. వీటితో పనులు నాణ్యాత ప్రమాణాలతో చేయాలన్నారు. ఇటీవల జరిగిన పనులు అంతంతమాత్రంగా ఉన్నాయన్నారు. ఈ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. నెహ్రల్లీ, మోటూరు ఛానల్, భూమికోడు తదితర కాలువల్లో చేయాల్సిన పనులపై అధికారులతో చర్చించారు. రూ.6.03 కోట్లతో డ్రెయినేజీ, రూ.1.70 కోట్లతో ఇరిగేషన్ పనులు చేపట్టాలన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఇరిగేషన్ డీఈలు భరత్, శ్రీను, డ్రైనేజి డీఈ గణపతి, ఏఈలు కుమార్, అనీల్, బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించే ఆధార్ కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రవికాంత్ పేర్కొన్నారు. మండలంలోని పెనమకూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. 23న తోట్లవల్లూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, 24న వల్లూరుపాలెం, 25న దేవరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటి ఆధార్ కార్డు తీసుకోని వారు, కొత్తగా నమోదు చేయించుకోవాలనుకునేవారు వెళ్లి చేయించుకోవచ్చని తెలిపారు. ఆధార్ కార్డులో ఏమైనా తప్పులు ఉంటే వాటికి సంబంధించి ధ్రువపత్రాలు తీసుకువచ్చి ఆధార్ సరిచేయించుకోవచ్చని తెలిపారు.

నిత్య నరకం.. ప్రమాదభరితం

కీలక రోడ్డుపై ఏళ్లుగా నిర్లక్ష్యం

పెంజెండ్ర(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే





గుంతలతో దారుణంగా మారిన జీఏజీ రహదారి

నియోజకవర్గంలో కీలకమైన గుడ్లవల్లేరు- అడ్డాడ ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి జీఏజీ (గుడ్లవల్లేరు - అడ్డాడ - గొల్వేపల్లి) తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. ఏళ్లుగా మరమ్మతులకు కూడా నోచుకోలేదు. భారీ గుంతలతో నరకాన్ని తలపిస్తున్న ఈ రోడ్డులో రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు భయపడుతున్నారు.

రెండు మండలాలు, రెండు నియోజకవర్గాలను కలిపే ఈ మార్గం ఇటు గుడ్లవల్లేరు, అటు పామర్రు మండలాలు, గుడివాడ, పామర్రు నియోజకవర్గాల ప్రజలకు ఇదే దారి. గతంలో నర్సాపురం, భీమవరం నుంచి విజయవాడ వెళ్లి వచ్చేందుకు ఇదే దగ్గర దారి కావడంతో ఆర్టీసీ బస్సులు తిరిగేవి. లేకుంటే చుట్టూ తిరిగేవి. గతంలో జడ్పీ మెటల్ రోడ్డుగా ఉన్న దీనిని తెదేపా హయాంలో మాజీ మంత్రి ఎర్నేని సీతాదేవి కృషితో ఆర్అండ్‌బీ రహదారిగా మార్పు చేశారు. అప్పటి నుంచి తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఈ రహదారిలో గుడ్లవల్లేరు, చిత్రం, పెంజెండ్రలతో పాటు పామర్రు మండలానికి చెందిన ఐనంపూడి, అడ్డాడ గ్రామాలు ఉన్నాయి. ఈ దారిలోనే గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల ఉంది. దీంతో నిత్యం వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వాహనాలు ఈ దారి గుండా గుడివాడ, పామర్రు, విజయవాడ, ఉయ్యూరు, కంకిపాడు నుంచి వస్తుంటారు. దీంతో పలుమార్లు కళాశాల యాజమాన్యమే ఈ రహదారికి మరమ్మతులు నిర్వహించేది. చివరిసారిగా 2017లో తెదేపా హయాంలో బీటీ రోడ్డు వేశారు. ప్రస్తుతం ఇది డొంక రోడ్డు కంటే అధ్వానంగా మారింది. అడుగడుగునా భారీ గుంతలతో నిండిపోయింది. వర్షాకాలం అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

అడ్డాడ వద్ద రోడ్డు బ్లాక్

పామర్రు-గుడివాడ రోడ్డులో గుడివాడ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులతో రాత్రి 11 తర్వాత పామర్రు నుంచి గుడివాడ వెళ్లే రహదారిని అడ్డాడ వద్ద బ్లాక్ చేస్తున్నారు. దీంతో గుడివాడ, గుడ్లవల్లేరు, ముదినేపల్లి వెళ్లే వాహనచోదకులు రాత్రిళ్లు చీకట్లోనే భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. రహదారి దుస్థితిపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టి సారించాలని ప్రజలతో పాటు తెదేపా నేత బొప్పన శివప్రసాద్ కోరుతున్నారు.

రీసర్వేపై గ్రామ సభలు

పమిడిముక్కల: గతంలో ప్రభుత్వం నిర్వహించిన రీసర్వేలో సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు పంచాయతీ కార్యాలయాల్లో రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు నవీన్ కుమార్ మంగళవారం తెలిపారు. తహసీల్దారు, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు, మండల సర్వేయరు, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు, గ్రామ సర్వేయరు, వీఆర్వోలు హాజరవుతారన్నారు. రైతులు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలని తెలిపారు. ఈనెల 25న ముళ్లపూడి, 26 వీరంకి, 28 అమీనపురం, 30 మంటాడ, నవంబరు 1న పైడికొండలపాలెం, 2 శ్రీరంగపురం, 4 చెన్నువారిపాలెం, 5 మామిళ్లపల్లి, 6 అగినపర్రు, 7 వేల్పూరు, 8 హనుమంతపురంలో సభలు జరుగుతాయని తహసీల్దారు తెలిపారు.

విద్యుత్తు ఉండని ప్రాంతాలు నేడు

పమిడిముక్కల: ఈ నెల 23న అగినపర్రు, మామిళ్లపల్లిలో విద్యుత్తు లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బి.శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు నేత్ర వైద్యపరీక్షలు

గుడ్లవల్లేరు: స్థానిక ఏఏఎన్ఎం, వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్‌లో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 400 మంది విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. కుమారుడు శివహర్ష జ్ఞాపకార్థం లయన్స్ మాజీ గవర్నర్ ఏఆర్‌కే చౌదరి ఆర్థిక వితరణతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 65 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. లయన్స్ మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్, అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు శశికళ, పెరుమాళ్లు, నవాబు, మోహన్‌రావు, పరంధామయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

31 వరకు నట్టల నివారణ మందు

కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని గొర్రెలు, మేకలకు ఈ నెల 31 వరకు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, రైతులు, జీవాల పోషకులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ లీనా వెల్లడించారు. పేగులు, కాలేయాల్లో పెరిగే బద్దెపురుగులు, కాలేయ పురుగుల వల్ల జీవాలు జీర్ణశక్తిని కోల్పోయి బరువు తగ్గుతాయని దీంతో యజమానులు నష్టపోతారన్నారు. వీటి నివారణకు వాటి యజమానులు తప్పనిసరిగా తమ సమీపంలోని పశువైద్య కేంద్రాల్లో టీకాలు వేయించాలని సూచించారు. మంగళవారం కౌతవరంలో నట్టల నివారణ కార్యక్రమాన్ని డీడీ సి.శ్రీనివాస్ ప్రారంభించి జీవాలకు టీకాలు వేశారు.

దేశ ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలి

గుడివాడ గ్రామీణం: దేశ ఆర్థిక ప్రగతిలో యువత భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో యాక్సెంచర్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సరైన కెరీర్ గైడెన్స్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యువత ఉపాధి నైపుణ్యాలు పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జాబ్‌మేళాలో 150 మంది విద్యార్థులు పాల్గొనగా 41 మందిని ఎంపిక చేసి నియామక పత్రాలు అందించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన బూరగడ్డ శ్రీకాంత్, తెదేపా నేత డాక్టర్ గోర్జి సత్యన్నారాయణ, కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు ఎల్.ఆర్.కె.ప్రసాద్, సెక్రటరీ, ప్రిన్సిపల్ పొట్లూరి జితేంద్ర శ్రీనివాస కుమార్, వైస్ ప్రిన్సిపల్ బి.ఎస్.ఎస్.పద్మజ, కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, కంపెనీ ప్రతినిధులు శరత్, భావన, జైకిషన్, తేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి క్రీస్తు సందేశం అవసరం



ప్రార్థన చేస్తున్న ఫాదర్‌లు థోమస్, అమల్

లక్ష్మీపురం(చల్లపల్లి), న్యూస్‌టుడే: క్రీస్తు శాంతి సందేశాలు ప్రపంచ శాంతికి అవసరమని కేరళకు చెందిన మంగళగిరి ఆర్‌సీఎం చర్చి ఫాదర్లు వీసీ థోమస్, అమల్‌లు అన్నారు. మంగళవారం చల్లపల్లి మండలం సాలిపేట ఆర్‌సీఎం చర్చిలో మరియమాత ప్రత్యేక పండగ పురస్కరించుకుని విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మేరీమాత విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు. చల్లపల్లి ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రవికుమార్, వివిధ రాష్ట్రాల ఫాదర్‌లు, సిస్టరు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ

అవనిగడ్డ: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నవంబర్ 5వ తేదీ నాగుల చవితి, 15వ తేదీ జ్వాలాతోరణం, 29వ తేదీ లక్ష బిల్వార్చన కార్యక్రమాల ప్రచార గోడ పత్రికను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆలయ ఉప కమిషనర్ , కార్యనిర్వాహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింగళి పేరు పెట్టడం హర్షణీయం

అవనిగడ్డ: మచిలీపట్నం మెడికల్ కళాశాలకు జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య పేరు పెట్టడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఇది యావత్తు తెలుగు జాతికి గర్వకారణమని చెప్పారు. ఆనాడు స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది పోరాటాలు చేశారని, నేటి తరానికి వారి పేర్లు కూడా చాలామందికి తెలియవని అన్నారు. అటువంటి ఎంతోమంది మహనీయులను భావితరాలకు గుర్తు చేసేందుకు వారి పేర్లు పెట్టడం శుభపరిణామమన్నారు.

భక్తితో గ్యార్మీ పండగ



జెండాలతో ముస్లింలు

లంకా దొడ్డి(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని డోకిపర్రు శివారు లంకాదొడ్డిలో మంగళవారం రాత్రి గ్యారీ షరీఫ్ వేడుకలు నిర్వహించారు. జెండాలను చేతబట్టి గ్రామంలో ఊరేగింపు జరిపారు. పలు ప్రదేశాల్లో ఉన్న స్థానిక ముస్లిం సోదరులంతా గ్రామానికి చేరుకోవడంతో సందడి నెలకొంది. రాత్రి అన్నదానం నిర్వహించారు.

పెదపారుపూడి: మండలంలోని వెంట్రప్రగడలో ముస్లిం సోదరులు జెండాలు పట్టుకొని వీధుల్లో ఊరేగించి అనంతరం దర్గా వద్ద ప్రతిష్ఠించారు. భారీ అన్నసమారాధన చేశారు. షేక్ బాజీ, సర్దార్, బాబ్జీ, నజీర్, షేక్ సమద్, బాషా, ఖాజా, మునీర్‌బాషా, మెహర్‌బాబా, జిలాని, ముస్లిం యువత తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీ ఆత్మహత్య

వేమవరం(గుడ్లవల్లేరు): మండలంలోని వేమవరం శివారు వేమవరపాలెం ఎస్సీవాడకు చెందిన వ్యవసాయ కూలీ కాటే నరసింహారావు(48) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, కుమార్డు, కుమార్తె ఉన్నారు. రోజువారీ పనులు చేసుకునే అతడు ఆర్థిక ఇబ్బందులు తాళలేక సోమవారం పురుగుమందు తాగడంతో కుటుంబ సభ్యులు తొలుత మచిలీపట్నం, తర్వాత విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ వెల్లడించారు.

కళాశాలలో ఇనుము చోరీ

పామర్రు: పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇనుము చోరీ కావడంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ అవినాష్ మంగళవారం తెలిపారు. కళాశాలలో నాడు- నేడు పనులు జరుగుతుండగా ఫిల్లర్ తదితరాలకు ఉపయోగించే 15 ఇనుప బుట్టలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

అవనిగడ్డ, మోపిదేవి, న్యూస్‌టుడే: స్థానిక స్టేట్ బ్యాంక్ రహదారి మీదుగా తరలిస్తున్న 4 టన్నుల రేషన్ బియ్యం ఆటోను పట్టుకుని, నిందితుడైన పెదకళ్లేపల్లికి చెందిన కూతాడ వెంకన్నబాబును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. * కోడూరు మండలం పిట్టలంక వాసి కె.సురేష్ ద్విచక్ర వాహనంపై అక్రమంగా రవాణా చేస్తున్న 150 కిలోల రేషన్ బియ్యాన్ని పెదప్రోలు పంచాయతీ శివారు మేకలడొంక సమీపంలో పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్సై వీర వెంకట సత్యనారాయణ తెలిపారు.

నరసింహపురం వద్ద మద్యం..

కోడూరు (అవనిగడ్డ): నరసింహపురం వద్ద 45 మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై చాణక్య తెలిపారు.

భారీ వృక్షం మాయం

మొవ్వ(కూచిపూడి): మొవ్వ శివారు ప్రాంతంలో గత నెల 8వ తేదీన కురిసిన భారీ వర్షాలకు రహదారికి అడ్డుగా నేలకొరిగిన భారీ వృక్షం మాయమైంది. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా కూచిపూడి ఎస్ఐ, సిబ్బంది, స్థానికుల సాయంలో ఆ చెట్టును ముక్కలుగా కోసి పక్కన పడేశారు. అనంతరం ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోడంలో ఆ చెట్టు కన్పించలేదు. దీనిపై ఇటీవల స్థానికులు ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

పిచ్చిమొక్కల తొలగింపు

స్పందనకు వందనం



మోపిదేవి, న్యూస్‌టుడే: 10వ నంబరు పంటకాల్వలో నీటి ప్రవాహాన్ని నిరోధిస్తున్న తూటుకాడ, పిచ్చిమొక్కలను తొలగించే పనులు చేపట్టారు. ఈనెల 18న మేమున్నాం... మీకోసం శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందనగా జలవనరుల శాఖ ఏఈ రవితేజ కూలీలతో తూటుకాడ, పిచ్చిమొక్కలను తొలగించే పనులు చేపట్టారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోవాలి



చల్లపల్లి: దరఖాస్తు స్వీకరిస్తున్న యువనేత మండలి వెంకట్రామ్(రాజా), తెదేపా, జనసేన నేతలు

చల్లపల్లి, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోవాలని అవనిగడ్డ నియోజవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్(రాజా) కోరారు. మంగళవారం చల్లపల్లిలోని ఏటీఎం సెంటర్‌లో ఓటు నమోదు ప్రత్యేక శిబిరాన్ని వెంకట్రామ్(రాజా) సందర్శించి దరఖాస్తులు స్వీకరించారు. వెంకట్రామ్(రాజా) మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ అభ్యర్థిగా ఎన్డీయే కూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్(రాజా) విజయానికి బాటలు వేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ పరిశీలకులు రావి సూర్యకిరణ్ తేజ, చంద్రమౌళి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీటీసీ స్వప్న, మాజీ వైస్ ఎంపీపీ నాగమణి, మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ నబీఘోరి, తెదేపా నేతలు నిడమానూరి దిలీప్‌కుమార్, మోర్ల శివ, పాల్గొన్నారు.

నాగాయలంక: పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెదేపా మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు అన్నారు. స్థానిక రంగా విగ్రహం వద్ద మంగళవారం ఓటరు నమోదు శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు.

పశు సంపదను పరిరక్షించుకుంటే మేలు

పులిగడ్డ(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: మేలు రకపు పశువుల పెంపకం ద్వారా పాడి పరిశ్రమను వృద్ధి చేసుకొని ఆర్థిక వనరులను సమకూర్చుకోవచ్చని జిల్లా పశువైద్యాధికారి చిన నరసింహులు అన్నారు. పులిగడ్డలో జిల్లా పశువైద్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన గొర్రెలకు , మేకలకు నట్టల నివారణ టీకా వేశారు. వేకనూరు పశువైద్యశాల భవనం నిర్మాణానికి మంజూరైన రూ.32లక్షల నిధులకు గుత్తేదారుడు ముందుకు రాకపోవడంతో వెనక్కి వెళ్లాయని అవనిగడ్డ సబ్‌డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ సాంబశివరావు ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. తిరిగి నూతన ప్రతిపాదనలు పంపినట్లు ఆయన పేర్కొన్నారు

లండన్ వాసి ఉదారత

కె.కొత్తపాలెం(మోపిదేవి): గత నెలలో వరదల వల్ల పాఠ్యపుస్తకాలు, చేతిరాత పుస్తకాలు కోల్పోయిన విద్యార్థులకు లండన్‌లో నివశిస్తున్న కె.కొత్తపాలెం వాసి పుప్పాల ధనుంజయం అండగా నిలిచారు. ఎస్సీవాడలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల చిన్నారులకు చేతిరాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర విద్యాసామగ్రిని ఎంఈవోలు దుర్గాసాగర్, పిచ్చియ్య, హెచ్ఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉపాధ్యాయులు దాత ప్రతినిధి సుబ్బారావు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆదాయం రూ.7.07లక్షలు



స్వామికి భక్తుల పూజలు

మోపిదేవి, న్యూస్‌టుడే: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి ఆదాయం ఒక రోజు రూ.7.07 లక్షల వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాద్ తెలిపారు. ఆర్జిత సేవ టిక్కెట్ల ద్వారా రూ.4.90 లక్షలు, ప్రసాదాల ద్వారా రూ.89 వేలు, అన్నదానం నిమిత్తం రూ.1.03 లక్షలతో పాటు మరికొంత ఆదాయం వచ్చిందని తెలిపారు. సాధారణ అభిషేకాల్లో 223 మంది, సర్పదోష నివారణ, పాలపొంగళ్లు 52 మంది, శాంతి కల్యాణంలో 67 మంది, శీఘ్ర దర్శనం 390 మంది పాల్గొన్నారు.

అద్దంకి నాంచారమ్మ ఆలయంలో..

కోడూరు (అవనిగడ్డ): మండల పరిధిలోని విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో హుండీ కానుకలు మంగళవారం లెక్కించగా రూ.2,38,400 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో సుధాకర్‌రావు తెలిపారు. ఈ ఏడాది జూన్ 22వ తేది నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకలు దేవాదాయ శాఖ తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు సమక్షంలో లెక్కించారు. దేవాదాయశాఖ సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

కోడూరు(అవనిగడ్డ): మండలంలో ముంపుకు గురైన వరి పొలాల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషి చేస్తున్నట్లు ఆయన తనయుడు వెంకట్రామ్ అన్నారు. కోడూరు మండలం ఉల్లిపాలెం, హంసలదీవి, పాలకాయతిప్ప, రామకృష్ణాపురం, ఊటగుండం, దింటిమెరక గ్రామాల్లో మంగళవారం ముంపునకు గురైన పొలాలను ఆయన పరిశీలించారు. రైతులు మాట్లాడుతూ.. మైనరు డ్రైన్లు పూడిక తీయించాలని, అవుట్‌ఫాల్ స్లూయిస్‌లను పునర్‌నిర్మించాలని కోరారు.

కొడాలి నాని జన్మదిన ఫ్లెక్సీల చించివేత

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని జన్మదినాన్ని పురస్కరించకుని ఆయన అభిమానులు సోమవారం అర్ధరాత్రి దాటాక పెదఎరుకపాడు మార్గం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చింపి వేశారు. వైకాపా నాయకులు ఆందోళన చేశారు. టూటౌన్ సీఐ చిన్ని నాగప్రసాద్ అక్కడకు చేరుకోగా వైకాపా నాయకులు మండలి హనుమంతరావు, పాలేటి చంటిలు మాట్లాడుతూ తమ నాయకుడి ఫ్లెక్సీని చించివేయడం దారుణమని, దాని స్థానంలో మళ్లీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సీఐ నాగప్రసాద్ కలుగజేసుకొని అనుమతులు లేకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి వివాదాలకు పాల్పడవద్దని, రాత్రంతా పోలీసులను కాపలా పెట్టలేమని తెలిపారు. పోలీసులు అధికార పక్షానికి వత్తాసు పలుకుతున్నారని విమర్శిస్తూ వైకాపా నాయకులు వెనుదిరిగారు. అలాగే నెహ్రూచౌక్ సెంటర్‌లో మోటూరుకు చెందిన గంటా సురేష్ కొడాలి నాని జన్మదిన ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా దానిని గుర్తుతెలియని చించివేశారు. మోటూరు వద్ద ఏర్పాటు చేసిన మరో బ్యానరును పంచాయతీ సిబ్బంది తొలగించారు.

రైతులకు త్వరలో పంట నష్టపరిహారం



మాట్లాడుతున్న ఏవో మురళీకృష్ణ, వేదికపై తదితరులు

ఘంటసాల: రైతులకు త్వరలో పంట నష్ట పరిహారం వారి బ్యాంకు ఖాతాల్లో జమవుతుందని ఏవో కె.మురళీకృష్ణ తెలిపారు. ఘంటసాల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ వేమూరి రజనీకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో ఇటీవల వర్షాలకు వరిపైరు నష్టపోయిన 400 మంది రైతులకు సాంకేతిక కారణాలతో వారి బ్యాంకు ఖాతాలలో పంట నష్టపరిహారం జమ కాలేదన్నారు. శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్నా) మాట్లాడుతూ శ్రీకాకుళం ఇసుక క్వారీ నుంచి ఇసుకను ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో ఇసుకను రవాణా చేసుకునే అవకాశం ఉందా? లేదా? తెలపాలన్నారు. ఎంపీడీవో సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో ఉపాధి పనులు, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. విద్యుత్ ఏఈ రవికుమార్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ పథకం ద్వారా ఇళ్లకు ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. జడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మురళీకృష్ణ, మండల అధికారులు, సర్పంచిలు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తెదేపా నియోజకవర్గ సర్వసభ్య సమావేశం నేడు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: తెదేపా నియోజకవర్గ సమావేశం 23వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరుగుతుందని తెదేపా జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, కోడూరు మండల తెదేపా అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా తెదేపా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, నియోజకవర్గ తెదేపా పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు పాల్గొంటారు. పార్టీ సభ్యత్వ నమోదుపై సమావేశంలో చర్చిస్తారు. 6 మండలాల తెదేపా నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళా నాయకులు పాల్గొనాలని కోరారు.

మెనూ అమలు చేయాలి

కూచిపూడి, న్యూస్‌టుడే: విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి భోజనం అందించాలని ఎంపీడీవో జె.విమాదేవి వంట ఏజెన్సీలకు సూచించారు. మొవ్వ మండలం కోసూరు జడ్పీ పాఠశాలలో మంగళవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. పాఠశాలలో 186మంది విద్యార్థులకు 160 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో 137 మంది భోజనం తినగా మిగిలిన 23 మంది విద్యార్థులు బాక్సులు తెచ్చుకున్నారు. మంచి రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీకు ఆమె సూచించారు. తహసీల్దారు మస్తాన్, ఎంఈవోలు శంకరరావు, శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ ఎమ్.ఎస్.కృష్ణ పరమాత్మ, ఆర్ఐ విజయదుర్గ, హెచ్ఎం నాగమణి, ఎస్ఎంసీ ఛైర్మన్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

20 రోజులుగా అంధకారం

పెదపారుపూడి న్యూస్‌టుడే: మండలంలోని వెంట్రప్రగడలో గత 20 రోజుల నుంచి వీధి దీపాలు లేక చిమ్మచీకట్లో ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సెంటర్‌లో బస్సులు దిగి గ్రామంలోకి రావడానికి కి.మీ. దూరం ఉంటుందని, విద్యార్థులు, మహిళలు చీకట్లో చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు రోడ్లపై గుంపు గుంపులుగా వీధి కుక్కలు తిరుగుతుండడం వల్ల నడచి రావాలంటే భయంగా ఉంటోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు

మద్యం దుకాణాల వద్ద తాగవద్దు

మోపిదేవి, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల వద్ద పర్మిట్ గదులకు అనుమతులు లేవని ఎక్సైజ్ సీఐ గిరిజా సత్యకుమారి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మోపిదేవి పెట్రోలు బంకు వద్ద ఏర్పాటుచేసిన మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల వద్ద మద్యం సేవించటం చట్టరీత్యా నేరమని, ఎంఆర్‌పీ ధరలు మంచి అమ్మితే చర్యలుంటాయన్నారు. దుకాణాల నలు హద్దులను పరిశీలించి రికార్డు చేశారు.

విద్యార్థులకు ఓపెన్‌హౌస్



తోట్లవల్లూరు: పోలీస్ స్టేషన్ విధులు గురించి వివరిస్తున్న ఎస్సై అర్జునరాజు

నందివాడ (గుడ్లవల్లేరు): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని నందివాడ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం స్థానిక హైస్కూల్ విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. స్టేషన్, రికార్డుల నిర్వహణ, పోలీసుల విధులు, కేసుల నమోదు, ఆయుధాలు, వాటిని వినియోగించే విధానాలను ఎస్ఐ కె.శ్రీనివాస్ వివరించారు. 1959 అక్టోబరు 21న సియాచిన్ ఆక్రమణకు యత్నించిన చైనాను నిలవరించడానికి భారత్ జవాన్లు చేసిన ప్రాణత్యాగాలకు గుర్తుగా అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహిస్తారని వివరించారు.

తోట్లవల్లూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీసులు అందిస్తున్న సేవల గురించి ఎస్సై అర్జునరాజు.. విద్యార్థులకు అవగాహన కల్పించారు.

తనను తాను

మనువాడిన బ్రిట్నీ!



మిసిసిపీ: అమెరికన్ పాప్‌స్టార్ బ్రిట్నీ స్పియర్స్ (42) గత ఆదివారం ఇన్‌స్టాగ్రాం వేదికగా పంచుకొన్న ఓ పోస్టు అందరినీ కలవరపాటుకు గురిచేసింది. 30 ఏళ్ల శాం అస్ఘరీతో 14 నెలలు కొనసాగిన బ్రిట్నీ వివాహబంధం ఇటీవలే ముగిసింది. గత మే నెలలో ఈ జంట విడాకుల ఒప్పందానికి వచ్చింది. ఈ నేపథ్యంలో పెళ్లిగౌను ధరించి బ్రిట్నీ ఇన్‌స్టాలో చేసిన పోస్టు అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది. "నన్ను నేను పెళ్లి చేసుకున్నా. ఇది తెలివితక్కువ పనిగా మీకు అనిపించవచ్చు. కానీ, నా జీవితంలో నేను చేసిన అద్భుతమైన పనిగా దీన్ని భావిస్తున్నా" అంటూ ఆమె రాసుకొచ్చారు. ఈ పోస్టుతోపాటు పంచుకొన్న వీడియోలో నవవధువులా నిలబడిన బ్రిట్నీ పక్కన వరుడు ఎవరూ లేరు. ఎటువంటి వివరణ లేకుండా ఖాళీగా ఉన్న చర్చి ఫొటో షేర్ చేసింది. ఒంటరిగా హనీమూన్‌కు బయలుదేరుతున్నట్లు విమానం పక్కన నిలబడి ఉన్న మరో పోస్టులో "టర్క్స్ అండ్ కేకస్, ఇదిగో నేను వచ్చేశా" అని బ్రిట్నీ వ్యాఖ్య జోడించింది. టర్క్స్ అండ్ కేకస్ దీవులు అట్లాంటిక్ సముద్రంలో ఉన్నాయి.

మరో 80 విమానాలకు బాంబు బెదిరింపులు

దిల్లీ: విమానయాన సంస్థలకు గత కొద్దిరోజులుగా వస్తున్న బాంబు బెదిరింపులు ఆగడంలేదు. సోమవారం నుంచి మంగళవారం మధ్య 24 గంటల్లో దాదాపు 80 జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు హెచ్చరికలు వచ్చాయని 'బాంబు బెదిరింపుల మూల్యాంకన కమిటీ ప్రకటించింది. దీంతో 24 గంటల్లో బెదిరింపులు అందుకున్న విమానాల సంఖ్య 80కి చేరుకుంది. గత తొమ్మిది రోజుల్లో 170 విమానాలకు కలిగిన అంతరాయం వల్ల రూ.600 కోట్ల నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు తెలిపారు.



వైఫల్యాల తర్వాత బలంగా పుంజుకోండి

జీవితం అంటే వైఫల్యాలను తప్పించుకోవడం కాదు! ఎన్ని వైఫల్యాలు ఎదురైనా తిరిగి బలంగా పుంజుకోవడం!! గెలుపు, ఓటమి అనేవి ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాల వంటివి. ఓటమికి వెరవకుండా, ప్రతిరోజూ మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకుంటూ ముందుకెళ్లండి.

– డేవిడ్ లవ్‌జాయ్, పాడ్‌కాస్టర్



పెన్సిల్వేనియా గెలవాల్సిందే!

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కీలకంగా మారిన రాష్ట్రం

వాషింగ్టన్: అమెరికా స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన పెన్సిల్వేనియా ప్రస్తుతం జరుగుతున్న అధ్యక్ష ఎన్నికల్లోనూ అత్యంత కీలకంగా మారింది. అధ్యక్షులుగా ఎన్నిక కావాలంటే ఈ రాష్ట్రంలో తప్పక గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ మధ్య ఈ రాష్ట్రంలో ఉత్కంఠ భరిత పోరు సాగుతోంది. పెన్సిల్వేనియాలో 19 ఎలక్టోరల్ కాలేజ్ ఓట్లున్నాయి. అత్యధికంగా కాలిఫోర్నియాలో 54 ఓట్లున్నాయి. ఇది డెమోక్రాట్లకు కంచుకోట. రిపబ్లికన్లు బలంగా ఉన్న టెక్సాస్‌లో 40 ఓట్లున్నాయి.



- దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో గతంలో అధ్యక్ష అభ్యర్థులకు వచ్చిన ఓట్ల ఆధారంగా ట్రంప్, హారిస్‌లకు వచ్చే ఓట్లను రాజకీయ నిపుణులు అంచనా వేశారు.
- ఏడు కీలక రాష్ట్రాల్లోని ఓట్లపైనే ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఇందులో ఆరిజోనా (11), విస్కాన్సిన్ (10), మిషిగన్ (15), పెన్సిల్వేనియా (19), జార్జియా (16), నార్త్ కరోలినా (16) ఉన్నాయి.
- వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇద్దరు అభ్యర్థులు పెన్సిల్వేనియాపై దృష్టి సారించారు. ఇక్కడ తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితి నెలకొంది.
- ఓటర్లను ఆకట్టుకునేందుకు ట్రంప్, హారిస్‌కు సంబంధించిన వేల మంది వాలంటీర్లు పెన్సిల్వేనియాలో మకాం వేశారు.
- పెన్సిల్వేనియాలో గెలవకుండా 270 ఎలక్టోరల్ ఓట్లు సాధించడం అసాధ్యమని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు.
- 270టువిన్.కామ్ వెబ్‌సైట్ అంచనా ప్రకారం.. హారిస్‌కు 226 ఓట్లు, ట్రంప్‌నకు 219 ఓట్లు రావొచ్చని అంచనా.




1 శాతం అటూఇటూ..

2016 ఎన్నికల్లో ట్రంప్ కేవలం 1శాతం ఓట్లతో పెన్సిల్వేనియాలో విజయం సాధించారు. అదే 1 శాతం ఓట్ల తేడాతో 2020లో ఈ రాష్ట్రాన్ని కోల్పోయారు.

- 2024 ఎన్నికల్లో నువ్వానేనా అన్నట్లు ఈ రాష్ట్రం ఉంది. దాదాపుగా టాస్ వేసినట్లుగానే ఫలితం ఉండవచ్చని అంటున్నారు.
- కీలక రాష్ట్రం కావడంతో ట్రంప్, హారిస్‌లు.. డబ్బు, సమయం, శక్తినంతా ఇక్కడే ధారపోస్తున్నారు. వాణిజ్య ప్రకటనలూ ఇక్కడే ఎక్కువగా ఇస్తున్నారు.
- పెన్సిల్వేనియా ఓటర్లను ఆకట్టుకోవడానికి సోమవారం నుంచి 21 మంది ప్రముఖులతో రిపబ్లికన్ పార్టీ బస్సు యాత్ర ప్రారంభించింది. ఇందులో భారతీయ అమెరికన్ కాష్ పటేల్ ఉన్నారు.
- రెండు పార్టీలకు చెందిన దాదాపు 50 సభలు గత 3 నెలల్లో పెన్సిల్వేనియాలో జరిగాయంటేనే ఇక్కడ పోటీ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.
- ప్రతి 4 డాలర్లలో 1 డాలరును ఈ రాష్ట్రంలోనే ప్రకటనల కోసం రెండు పార్టీలు ఖర్చు చేశాయి.
- ట్రంప్ ఇటీవల మెక్ డొనాల్డ్‌లో అక్కడి సిబ్బందిలా దుస్తులు వేసుకుని పని చేసింది ఈ రాష్ట్రంలోనే కావడం విశేషం.

హెజ్‌బొల్లా రాకెట్ల వర్షం

కూల్చేసిన ఇజ్రాయెల్ ● నెతన్యాహు సేనల దాడిలో 13 మంది మృతి



బీరుట్‌లో ధ్వంసమైన భవనాల వద్ద సహాయక చర్యలు

టెల్ అవీవ్: ఇజ్రాయెల్ మధ్య ప్రాంతంపై హెజ్‌బొల్లా మంగళవారం రాకెట్లతో విరుచుకుపడింది. వాటిని ఇజ్రాయెల్ అడ్డుకుంది. ఒక రాకెట్ నిర్మానుష్య ప్రాంతంలో పడింది. ఈ దాడుల్లో ఒక రిజర్విస్టు సైనికుడు మృతి చెందాడు. దాడుల నేపథ్యంలో 10 లక్షల మంది ఇజ్రాయెలీలు సురక్షిత బంకర్లలో తలదాచుకున్నారు. విమాన సేవలకు కొంత అంతరాయం కలిగింది. మరోవైపు సోమవారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 13 మంది లెబనాన్ వాసులు మరణించారు. పలువురు గాయపడ్డారు. ఇటు పశ్చిమాసియాలో పర్యటిస్తున్న అమెరికా విదేశాంగశాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్.. కాల్పుల విరమణకు అవకాశాలు స్వల్పమేనని పేర్కొన్నారు. హెజ్‌బొల్లా మంగళవారం ఇజ్రాయెల్‌లోని జనసమర్థ ప్రాంతాలపై రాకెట్ దాడులు చేసింది. అయితే ఎటువంటి నష్టం జరగలేదని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. బ్లింకెన్ ఇజ్రాయెల్‌కు రావడానికి కొద్ది గంటల ముందు ఈ దాడులు జరిగాయి. 5 ప్రొజెక్టైల్స్‌ను లెబనాన్ నుంచి హెజ్‌బొల్లా ప్రయోగించిందని, వాటిలో ఒక్కటి మినహా అన్నింటినీ క్షిపణి రక్షణ వ్యవస్థ అడ్డుకుందని ఇజ్రాయెల్ తెలిపింది. ఒకటి నిర్మానుష్య ప్రాంతంలో పడిందని వెల్లడించింది. దాడుల కారణంగా బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. బీరుట్‌లోని ప్రధాన ఆసుపత్రి ప్రాంతంలో సోమవారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 13 మంది మరణించారని లెబనాన్ ఆరోగ్యశాఖ ప్రకటించింది. 57 మంది గాయపడ్డారని తెలిపింది.

★ లెబనాన్, సిరియా సరిహద్దులోని జాతీయ రహదారిపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. సిరియాలోని ప్రాంతంపై మంగళవారం ఈ దాడి జరిగినట్లు జాతీయ వార్తా సంస్థ వెల్లడించింది.

రద్దీ ప్రాంతంపై ఇజ్రాయెల్ దాడి

బీరుట్: లెబనాన్ రాజధాని బీరుట్‌కు దక్షిణాన ఉన్న రద్దీ ప్రాంతంపై మంగళవారం ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ ప్రాంతంలోనే శరణార్థి శిబిరం కూడా ఉంది. హెజ్‌బొల్లా స్థావరాలుగా పేర్కొంటూ రెండు భవనాలపై ఇజ్రాయెల్ బాంబులతో దాడి చేసింది. ఈ దాడుల్లో మరణాలపై వివరాలందలేదు. ఫ్రాన్స్ రాయబారి ఇంటికి దగ్గరలోనే ఈ దాడి జరిగింది.

వక్ఫ్ బిల్లుపై జేపీసీ భేటీ రసాభాస

- గాజుసీసా పగలగొట్టి ఛైర్మన్ వైపు విసిరిన టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ
- ఎంపీ చేతికి గాయం..



చేతికి కట్టుతో కల్యాణ్ బెనర్జీ

దిల్లీ: కేంద్రం ప్రతిపాదించిన వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమావేశం మంగళవారం రసాభాసగా మారింది. ప్రారంభమైన కొద్దిసేపటికే ఎంపీలు వాగ్వాదానికి దిగారు. టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ తనకు ఎదురుగా నీళ్ల కోసం పెట్టిన గాజుసీసాను టేబులుకేసి కొట్టగా ఆయన చేతివేళ్లకు గాయమైంది. అనంతరం పగిలిన బాటిల్‌ను ఛైర్మన్ వైపు కల్యాణ్ విసిరారు. ఫలితంగా సమావేశం వాయిదా పడింది. బెనర్జీకి పార్లమెంటు ఆవరణలోని డిస్పెన్సరీలో ప్రథమచికిత్స చేసి కుట్లు వేశారు. ఈ వ్యవహారాన్ని పార్లమెంటరీ కమిటీ తీవ్రంగా పరిగణించింది. భాజపా సభ్యుడు నిశికాంత్ దుబే తీర్మానం ప్రవేశపెట్టగా, 10-8 ఓటింగుతో ఆమోదించిన కమిటీ కల్యాణ్ బెనర్జీని సమావేశాల నుంచి ఒకరోజు సస్పెండు చేస్తూ నిర్ణయం తీసుకొంది. భాజపా ఎంపీ జగదాంబికా పాల్ అధ్యక్షతన ఏర్పాటైన సమావేశం ఒడిశాకు చెందిన రిటైర్డ్ జడ్జీలు, న్యాయవాదుల అభిప్రాయాలు వింటుండగా ఈ వివాదం తలెత్తింది.

వదిలేస్తే.. రేపు తుపాకీతో వస్తారు: పాల్

జేపీసీ సమావేశంలో జరిగిన దాడి నుంచి తాను త్రుటిలో తప్పించుకొన్నట్లు ఛైర్మన్ జగదాంబికా పాల్ తెలిపారు. సభ్యులను ఇలా వదిలేస్తే రేపటి సమావేశానికి మరొకరు రివాల్వరుతో వస్తారని మీడియా ఎదుట వ్యాఖ్యానించారు. బాటిల్‌ను ఛైర్మన్ వైపు విసరడం తన ఉద్దేశం కాదని కల్యాణ్ బెనర్జీ విచారం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

గుజరాత్‌లో అయిదేళ్లుగా నకిలీ కోర్టు!

- భూవివాదాలు లక్ష్యంగా తీర్పులు
- మోసగాడైన 'జడ్జి' అరెస్టు





అహ్మదాబాద్: ఉత్తుత్తి బ్యాంకులు.. పోలీసులు.. ఇపుడు ఏకంగా కోర్టులు కూడా ఈ జాబితాలో చేరాయి. గుజరాత్ రాజధాని నగరంలో గత అయిదేళ్లుగా "తీర్పులు" ఇస్తున్న నకిలీ కోర్టు గుట్టు రట్టయ్యింది. నకిలీ ట్రైబ్యునల్ ఏర్పాటు చేసి, న్యాయమూర్తిగా తీర్పులు ఇచ్చిన మోరిస్ శామ్యూల్ క్రిస్టియన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శామ్యూల్ అనుచరులే కోర్టు సిబ్బందిగా, న్యాయవాదులుగా నటించేవారు. గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో నిజమైన కోర్టు వాతావరణాన్ని శామ్యూల్ సృష్టించాడని పోలీసులు తెలిపారు. అహ్మదాబాద్ సిటీ సివిల్‌కోర్టు రిజిస్ట్రారు నగరంలోని కరంజ్ పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడు శామ్యూల్ ప్రభుత్వ భూమికి సంబంధించి 2019లోనే తన క్లయింట్‌కు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చాడు. తర్వాత ఆ భూమి రెవెన్యూ రికార్డుల్లో తన క్లయింట్ పేరును చేర్చాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు. ఈ ఉత్తర్వును అమలుచేయాలని కోరుతూ శామ్యూల్ మరొక న్యాయవాది ద్వారా సిటీ సివిల్‌కోర్టులో అప్పీల్ చేశాడు. తాను జారీ చేసిన నకిలీ ఉత్తర్వులను కూడా ఈ పిటిషనుకు జత చేశాడు. ఆ ఉత్తర్వులు నకిలీవని కోర్టు రిజిస్ట్రారు గుర్తించడంతో శామ్యూల్ బండారం బయటపడింది.

● గత అయిదేళ్లుగా శామ్యూల్ నకిలీ కోర్టు నడుపుతోంది. సిటీ సివిల్‌కోర్టులో భూవివాదాల కేసులు పెండింగులో ఉన్న కక్షిదారులను గుర్తించి నిందితుడు వల పన్నేవాడు. ప్రభుత్వం నియమించిన అధికారిక మధ్యవర్తిగా పరిచయం చేసుకునేవాడు. తర్వాత పిటిషనర్లను తన 'కోర్టు'కు పిలిపించుకునేవాడు. అక్కడ ట్రైబ్యునల్ ప్రిసైడింగ్ అధికారిగా నటిస్తూ తన క్లయింట్లకు అనుకూలమైన తీర్పులు ఇచ్చి, ఉత్తర్వులను జారీ చేస్తాడు. వారి నుంచి సొమ్ము తీసుకునేవాడు.

గుర్తింపుపై చిగురించిన ఆశలు..

న్యూస్‌టుడే, కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం)

నేడు కృష్ణా విశ్వవిద్యాలయానికి 'న్యాక్' బృందం



- వర్సిటీలో ఉన్న కళాశాలలు 3, విద్యార్థులు 2,500
- ఉప ప్రాంగణం: డా.ఎంఆర్ఏఆర్ పీజీ సెంటర్, నూజివీడు
- అనుబంధ కళాశాలలు 160, విద్యార్థులు 48,000
- ఇప్పటి వరకు సాధించిన గుర్తింపులు: ఐఎస్‌వో, యూజీసీ - 12బి

మచిలీపట్నంలో కృష్ణా విశ్వవిద్యాలయం ప్రారంభమై 16 ఏళ్లు అవుతోంది. ఇంతవరకు న్యాక్ గుర్తింపు రాలేదు. కూటమి ప్రభుత్వ చొరవతో ప్రస్తుతం అన్ని వసతులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఇక్కడ ఆర్ట్స్ అండ్ సైన్స్, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో అత్యాధునిక వసతులతో పాటు ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. న్యాక్ గుర్తింపు సాధనలో భాగంగా ఇప్పటికే విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి అవసరమైన కార్యాచరణ చేపట్టింది. బోధనతో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యం ఇలా మొత్తం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం మొత్తం ఏడు అంశాలపై నివేదిక అందించింది. బుధవారం నుంచి (23, 24, 25 తేదీలు) శుక్రవారం వరకు వర్సిటీని న్యాక్ బృందం సభ్యులు సందర్శించనున్నారు. ఆయా అంశాలు పరిశీలించి సంతృప్తి చెందితే గుర్తింపు అందిస్తారు.

ప్రయోజనాలెన్నో..

విశ్వవిద్యాలయాలకు ప్రతి ఐదేళ్లకు ఓసారి న్యాక్ గుర్తింపు ఇస్తారు. ఈ హోదా ఉంటే కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ ప్రాజెక్టులు, పరిశోధనలకు నిధులు మంజూరు అవుతాయి. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతాయి. గతంలో వర్సిటీకి ఐఎస్‌వో సర్టిఫికేషన్ రాగా.. 2021లో యూజీసీ 12బి గుర్తింపు సాధించింది.

అన్ని ఏర్పాట్లు చేశాం..



న్యాక్ బృందం తొలిసారి విశ్వవిద్యాలయంలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశాం. ఈ గుర్తింపు సాధనలో భాగంగా ఎప్పటి నుంచో కసరత్తు చేశాం. గుర్తింపు ఇచ్చేందుకు అవసరమైన అన్ని వసతులు ప్రస్తుతం వర్సిటీలో ఉన్నాయి. బోధనతో పాటు ఇతర అంశాల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్నాం. న్యాక్ గుర్తింపు వస్తే విశ్వవిద్యాలయంలో పరిశోధన అవకాశాలు విస్తృతం అవడంతో పాటు వర్సిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా దోహదపడుతుంది. కచ్చితంగా గుర్తింపు సాధిస్తామన్న నమ్మకంతో ఉన్నాం.

-రాయన శ్రీనివాసరావు, ఉపకులపతి

ఇంకా వెంటాడుతున్న సమస్యలు..

గతంతో పోల్చుకుంటే పలు వసతులు సమకూరినా ఇంకా అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. వాటిలో ప్రధానమైన సమస్య వసతిగృహాలు లేకపోవడమే. ఈ కారణంగా ఇక్కడ చేరేందుకు దూరప్రాంత విద్యార్థులు వెనుకంజ వేస్తున్నారు. గతేడాది డిసెంబరు నాటికే భవన నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉన్నా వివిధ కారణాలతో జాప్యం జరిగింది. వీటితో పాటు రూ.6కోట్లతో ఫార్మసీ కళాశాల, రూ.8 కోట్లతో ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు ప్రారంభించారు. దీని నిమిత్తం ప్రాంగణంలోనే ఐదు ఎకరాల చొప్పున స్థలం కేటాయించారు. ఫుడ్ కోర్టు నిర్మాణానికి రూ.1.5కోట్లు, ప్రహరీతో పాటు ముఖద్వారం నిర్మాణానికి రూ.3.5కోట్లు నిధులతో చేపట్టిన ఈ పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. బయో డైవర్సిటీ ప్లాంట్‌తో పాటు ఆక్వా పాండ్ తదితరాలు కూడా వర్సిటీ ప్రాంగణంలో ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఎంతవరకు ఫలితమిస్తాయో వేచి చూడాల్సి ఉంది.

మద్యం తయారీ కేంద్రాల్లో సీఐడీ తనిఖీలు

ఆటోనగర్, కంచికచర్ల, న్యూస్‌టుడే : విజయవాడ ఆటోనగర్‌లోని కాంటినెంటల్ వైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డిస్టిలరీపై మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సీఐడీ అధికారులు తనిఖీలు చేయడం ప్రారంభించారు. రాత్రి 10:30 గంటల వరకు కొనసాగాయి. గత ప్రభుత్వంలో ఈ కేంద్రంలో ఎంత మొత్తంలో మద్యం తయారు చేశారు, ఎంత ఎగుమతి చేశారు తదితర అంశాలపై అధికారులు రికార్డులు పరిశీలిస్తున్నారు. ఈ కేంద్రంలో వివిధ బ్రాండ్ల మద్యాన్ని తయారు చేస్తారు. అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో 13 మంది సీఐడీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్థానిక పోలీసుల సహకారంతో బయట వ్యక్తులు లోపలికి రాకుండా లోపల వ్యక్తులు బయటకు వెళ్లకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారు.



ఆటోనగర్‌లోని కాంటినెంటల్ వైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో తనిఖీ చేస్తున్న సీఐడీ అధికారులు

సెంథినీలో...

కంచికచర్ల మండలం గండేపల్లి శివారు సెంథినీ బయో ప్రాడక్ట్స్ కర్మాగారంలో కూడా సీఐడీ అధికారులు రాత్రి 10 గంటల వరకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. వివరాలు చెప్పేందుకు అధికారులు ఇష్టపడటం లేదు. 2019-24 మధ్య కాలంలో మద్యం తయారీ రికార్డులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

శర్వాని కంపెనీలో..

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను పంచాయతీ పరిధిలో 8 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన శర్వాని మద్యం తయారీ కర్మాగారంలో మంగళవారం రాత్రి రాత్రి 10 గంటల వరకూ వరకు సీఐడీ అధికారులు తనిఖీ చేస్తూనే ఉన్నారు. సోదాలు పూర్తయ్యేందుకు ఇంకా సమయం పడుతుందని తెలిసింది. సీఐడీ అదనపు ఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయాన్నే కంపెనీ వద్దకు చేరుకున్నట్లు సమాచారం. కంపెనీలో మద్యం తయారీ రకాలు, దస్త్రాలను తనిఖీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక హైదరాబాదుకు చెందిన సి.చంద్రారెడ్డి తదితరులు 2017లో ఇక్కడ మద్యం తయారీ కర్మాగారం ప్రారంభించారు. ప్రస్తుతం ర్యాడిక్ కంపెనీకి చెందిన ఫార్ములా మద్యం తయారు చేస్తున్నట్లు సమాచారం. గత వైకాపా పాలనలో ఇక్కడి కంపెనీలో తయారు చేసిన కొన్ని మద్యం రకాలపైన సీఐడీ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

గొడవర్రు, దావులూరులో..

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: సీఐడీ అధికారులు స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులతో కలిసి గొడవర్రులోని బీఏఎస్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్, దావులూరులోని బీఆర్‌కే స్పిరిట్స్ సంస్థలో సోదాలు నిర్వహించారు. ప్రధానంగా 2019- 24 సంవత్సరాల్లో పలు ఫిర్యాదుల నేపథ్యంలో ఈ దాడులు చేసినట్లు తెలుస్తోంది. రికార్డుల పరిశీలన, గోదాముల్లోని నిల్వ సరకు, తయారీ, నాణ్యత తదితర అంశాలను పరిశీలిస్తున్నారు.

బకాయి బిల్లుల చెల్లింపు ఆనందదాయకం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : రహదారుల అభివృద్ధి పనులకు సంబంధించి మూడేళ్ల నుంచి రూ.3 వేల కోట్లు బకాయి ఉండగా... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోపే రూ.748 కోట్లు విడుదల చేసి గుత్తేదారుల్లో ఆనందాన్ని నింపిందని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) జాతీయ ఉపాధ్యక్షుడు డి.పంకజ్‌రెడ్డి అన్నారు. గుత్తేదారులకు బకాయి బిల్లులు విడుదల చేసిన నేపథ్యంలో విజయవాడ ఎంజీ రోడ్డులోని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ కార్యాలయంలో మంగళవారం సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పులు తీసుకొచ్చి పనులు చేశామని, బిల్లుల చెల్లింపు జాప్యం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు.



సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలియజేస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

మిగిలిన నిధులు కూడా విడతల వారీగా చెల్లించాలని కోరారు. సీఆర్ఎఫ్ నిధుల కింద రూ.350 కోట్లు కేటాయించడమే కాకుండా... అదనంగా రూ.150 కోట్లు విడుదల చేయడానికి అంగీకరించిన కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి అభినందనలు తెలియజేశారు. చిన్న గుత్తేదారులకు రావాల్సిన పాత బకాయిలు రూ.200 కోట్లు కూడా నిధులు విడుదల చేయాలని కోరారు. జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు చెరువు రామకోటయ్య మాట్లాడుతూ... ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకున్నారని తెలిపారు. బీఏఐ రాష్ట్ర ఛైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ.. అభివృద్ధిలో భాగస్వాములయ్యే గుత్తేదారులకు ప్రభుత్వం సహకారం అందిస్తోందనే ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వెంకటనాగిరెడ్డి, ఎన్.నాగేశ్వరరావు, ఎ.కాశీవిశ్వేశ్వరరావు, కోశాధికారి పి.శేషగిరిరావు, బి.రాఘవరావు, వల్లభనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బుడమేరు గండి పూడ్చడంలో కీలకంగా వ్యవహరించిన జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు వల్లభనేని వెంకటేశ్వరరావును అభినందించారు.

కృష్ణా వరద తగ్గుముఖం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ వద్ద మంగళవారం వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఉదయం 8 గంటలకు ఎగువ నుంచి 2,05,179 క్యూసెక్కుల మేర వచ్చింది. 20 గేట్లను 5 అడుగులు, మిగతా 50 గేట్లను 4 అడుగులు ఎత్తారు. సముద్రంలోకి 1,96,750 క్యూసెక్కులు, పంట కాల్వలకు 8,429 క్యూసెక్కులు విడుదల చేశారు. క్రమేపీ వరద తగ్గుముఖం పట్టింది. సాయంత్రం 6 గంటలకు ఎగువ నుంచి 1,38,718 క్యూసెక్కులు రాగా, 40 గేట్లను 4 అడుగులు, మిగతా 30 గేట్లను 3 అడుగుల మేర ఎత్తారు. సముద్రంలోకి 1,69,250 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎగువ నుంచి పులిచింతల (వజినేపల్లి) ద్వారా 1,32,062, మునేరు (కీసర) నుంచి 6,271, పాలేరు నుంచి 385 క్యూసెక్కుల మేర వస్తోంది.

కాల్వలకు 9,824 క్యూసెక్కులు

ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాల్వలకు 9,824 క్యూసెక్కులు ఇస్తున్నారు. వీటిలో కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 6,318, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 3,506 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 3105, ఏలూరు కాల్వకు 1204, కేఈబీ కాల్వకు 1104, బందరు కాల్వకు 905 క్యూసెక్కులను విడుదల చేశారు.

బీఎస్సీ నర్సింగ్ సీట్ల భర్తీకి చర్యలు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని కళాశాలల్లో అందుబాటులో ఉన్న బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్లు, రెండేళ్ల కోర్సుల్లో ప్రవేశానికి ఐచ్ఛికాలు పెట్టుకోవాలని విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేర్కొంది. విశ్వవిద్యాలయానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ రోజు (మంగళవారం) రాత్రి 9 గంటల నుంచి 25వ తేదీ రాత్రి 9 గంటల్లోగా ఐచ్ఛికాలు ఇచ్చుకోవాలని, ఇతర వివరాలకు 90007-80707, 80082-50842 నెంబర్లలో సంప్రదించవచ్చని విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి.

ఎండీఎస్ ప్రత్యేక స్ట్రే కౌన్సెలింగ్‌కు... రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు దంత వైద్య కళాశాలల్లో కౌన్సెలింగ్‌లో భర్తీ కాని పీజీ దంత వైద్యం (ఎండీఎస్) సీట్లకు ఈరోజు రాత్రి 9 గంటల నుంచి బుధవారం (23వ తేదీ) మధ్యాహ్నం 12 గంటల్లోగా ఆప్షన్లు పెట్టుకోవాలని, సీట్ల వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని అధికారులు తెలిపారు.

28, 30 తేదీల్లో ఐటీఐ ఐదో విడత కౌన్సెలింగ్

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: నాలుగో విడత కౌన్సెలింగ్ అనంతరం ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్లకు ఐదో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విజయవాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, కన్వీనర్ ఎం.కనకారావు ఓ ప్రకటనలో తెలిపారు. అర్హతగల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ రాత్రిలోగా 'ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తుదారులు ఏ కళాశాలకు తమ ఐచ్ఛికాలు పెట్టుకుంటారో అక్కడికి 27వ తేదీ సాయంత్రం 3 గంటల్లోగా వెళ్లి తమ ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకొని అక్కడ ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో కౌన్సెలింగ్‌కు రావాలని సూచించారు. ఈనెల 28న ప్రభుత్వ, 30న ప్రైవేటు ఐటీఐల్లో కౌన్సెలింగ్ ఉంటుందని, అన్ని పత్రాలతో రావాలని తెలిపారు. ఇతర వివరాలకు 94906-39639, 77804-29468 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

అత్యాధునిక వసతులతో సొంతింటి కల సాకారం

పట్టాభిపురం: అత్యాధునిక వసతులతో ప్రజలకు సొంతింటి కల సాకారం చేస్తున్నామని శ్రీభ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు పేర్కొన్నారు. గుంటూరు రింగ్‌రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో శ్రీభ్రమర హౌసింగ్ సంస్థ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. రామచంద్రరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు 9,000 మందికి పైగా సొంతింటి కల సాకారం చేశామన్నారు. నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలన్న ఆశయంతో 2015లో శ్రీభ్రమర టౌన్‌షిప్స్‌ను ప్రారంభించామని తెలిపారు.



జ్యోతి వెలిగించి వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న శ్రీభ్రమర టౌన్‌షిప్స్ ఛైర్మన్ గల్లా రామచంద్రరావు

గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 30కి పైగా అద్భుతమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేసి అభివృద్ధి చేసి స్థిరాస్తి రంగంలో ప్రత్యేక ముద్ర వేశామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఆధునిక సౌకర్యాలతో ప్రాజెక్టులు చేపట్టి నగర జీవనశైలిని సమతుల్యం చేసేందుకు శ్రీభ్రమర కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎం.ఎస్.రాజు, లక్ష్మీపతిరాజు, శైలారెడ్డి, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, కాకర్ల సతీష్, కమ్మ రవి పాల్గొన్నారు.